**విలేకరులు కావలెను**

**పెన్ సత్తా తెలుగు దినపత్రిక**

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 3 | సంచిక : 310 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | గురువారం 2 ఏప్రిల్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


# అమరావతికి జై



- చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- బిల్లుపై దాదాపు 2 గంటలపాటు చర్చ
- 11 పార్టీల భాగస్వామ్యం
- పది పార్టీల సంపూర్ణ మద్దతు
- వైకాపా ఒక్కటే వాకౌట్
- అమరావతే ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధాని
- మూజువాణి ఓటుతో ఆమోదించిన సభ

## రాష్ట్రానికి చెందిన దళిత నేత చేతుల మీదుగా బిల్లు పాస్

అమరావతికి వైకాపా నాయకులు ఎంత కులం రంగు పులిమినా అంతిమంగా ఆ బిల్లు లోక్‌సభలో బాపట్ల నుంచి తెదేపా తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న దళిత ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ చేతుల మీదుగానే పాస్ అయింది. ఆయనే బిల్లును సభలో ఓటింగ్‌కు పెట్టి అనుకూలమైన వారు ఎస్ చెప్పండి.. వ్యతిరేకించేవాళ్లు నో చెప్పండి అని పిలిచారు. అయితే సభ్యులంతా ఎస్ అని చెప్పడంతో కరతాళధ్వనుల మధ్య బిల్లు పాసైనట్లు ప్యానల్ స్పీకర్ హోదాలో కృష్ణప్రసాద్ ప్రకటించారు. రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందటం చారిత్రక ఘట్టమని, ఆ సమయంలో ప్యానల్ స్పీకర్‌గా సభకు అధ్యక్షత వహించడంతో తన జన్మ ధన్యమైందని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టపరమైన భరోసా కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టసవరణ బిల్లుకు లోక్‌సభ ముక్తకంఠంతో జైకొట్టింది. సుమారు రెండు గంటలపాటు జరిగిన చర్చలో 11 పార్టీల నుంచి పాల్గొన్న 17 మంది సభ్యుల్లో 16 మంది రాజధానిగా అమరావతికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఒక్క వైకాపా మాత్రమే వాకౌట్ చేసి ఊరందరిదీ ఒకదారైతే ఉలిపికట్టెది మరోదారి అని నిరూపించుకొంది. రైతులు త్యాగం చేసిన 33 వేల ఎకరాల భూముల్లో పురుడుపోసుకున్న అమరావతికి వ్యతిరేకంగా 2019–24 మధ్యలో వైకాపా పాలకులు తీసుకున్న నిర్ణయాల నేపథ్యంలో.. అమరావతినే రాజధానిగా స్థిరపరిచేందుకు కేంద్ర హోం శాఖ తీసుకొచ్చిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టసవరణ బిల్లును హోం శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ 12.06 గంటలకు ప్రవేశపెట్టారు. స్పీకర్ ఓం బిర్లా చర్చకు పచ్చజెండా ఊపారు. చర్చా సమయాన్ని గంటకు పరిమితం చేద్దామా అని ఆయన ప్రతిపాదించారు. రెండు గంటలపాటు కొనసాగించాలని సభ్యులు కోరడంతో అందుకు అంగీకరించారు. ప్రధాన ప్రతిపక్షం నుంచి కాంగ్రెస్ సభ్యుడు మాణికం ఠాగూర్‌తో మొదలైన చర్చలో ఏపీ నుంచి పెమ్మసాని చంద్రశేఖర్, సీఎం రమేష్, మిథున్‌రెడ్డి, దగ్గుబాటి పురందేశ్వరి, వల్లభనేని బాలశౌరి, కలిశెట్టి అప్పలనాయుడుతోపాటు, తెలంగాణ నుంచి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కాంగ్రెస్ సభ్యులు రామసహాయం

- మిగతా 2లో



## ఉచిత విద్యుత్ పథకంతో చేనేత కుటుంబాలకు ఉపశమనం

ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమల్లోకి తెచ్చి మరో ఎన్నికల హామీని నెరవేర్చిందని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఈ పథకం కింద మగ్గానికి 200 యూనిట్లు, పవర్‌లూమ్‌కు 500 యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్ అందిస్తోందని

- మిగతా 2లో



## పన్ను తగ్గిస్తున్నాం..

ఇతర రాష్ట్రాల బస్సులను ఏపీకి తీసుకురండి

ట్రావెల్స్ బస్సుల పన్నును త్రైమాసికానికి సీటుకు రూ.4 వేల నుంచి రూ.2,500కి తగ్గించనున్నామని, ఇప్పటి వరకు ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న

- మిగతా 2లో

## వైభవోపేతం.. రాములోరి కల్యాణం

పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు దంపతులు

తరలి వచ్చిన భక్తజనం



వైఎస్సార్ కడప జిల్లా ఒంటిమిట్టలోని కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవం బుధవారం వైభవోపేతంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవాన్ని వీక్షించడానికి భక్తులు అశేష సంఖ్యలో తరలివచ్చారు. ఈ నేపథ్యంలో కోదండ రామాలయాన్ని శోభాయమానంగా తితిదే ముస్తాబు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు మనవడు దేవాన్ష్‌తో కలిసి స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు, తితిదే కానుకగా అందజేసిన కిలో బంగారంతో తయారు చేసిన స్వర్ణముఖ పట్టీని సమర్పించారు. పరిణయ వేడుకను తిలకించడానికి వచ్చిన భక్తులకు స్వామివారి తలంబ్రాలను ఉచితంగా పంపిణీ చేశారు. వీటితో పాటు లడ్డూ ప్రసాదం అందజేశారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు కల్యాణోత్సవం దేదీప్యమానంగా సాగింది. జగత్కల్యాణ ఘట్టాన్ని పండు వెన్నల్లో కనుల

- మిగతా 2లో



## ట్రంప్ గజిబిజి మాటలు

- 2-3 వారాల్లో యుద్ధం ముగుస్తుందని తొలుత వ్యాఖ్య
- హర్మూజ్‌ను తెరవకపోయినా దాడులు ఆపుతామని ప్రకటన
- తర్వాత స్వరం మార్చిన అమెరికా అధ్యక్షుడు
- హర్మూజ్‌ను తెరవకపోతే ఇరాన్‌పై బాంబుల వర్షం కురిపిస్తామని హెచ్చరిక
- పశ్చిమాసియాలో కొనసాగుతున్న దాడులు
- యూఏఈలో డ్రోన్ శకలాలు తగిలి భారతీయుడికి గాయాలు

- మిగతా 2లో

## 'మావిగన్'ను రాజధానిగా ప్రకటించండి

- అసెంబ్లీలో తీర్మానం డ్రామా
- వాళ్లు సవరణ చేస్తే మళ్లీ మార్చలేరా?
- అమరావతి గుదిబండ
- డబ్బంతా అక్కడే పెడితే మిగిలిన ప్రాంతాలు ఏం కావాలి?
- మాజీ సీఎం జగన్ విమర్శలు
- అమరావతికి తాము వ్యతిరేకం కాదని వ్యాఖ్య



మచిలీపట్నం–విజయవాడ–గుంటూరు మధ్యనున్న 110 కి.మీ.ల జాతీయ రహదారికి రెండువైపులా ఉన్న ప్రాంతాన్ని రాష్ట్ర రాజధాని ప్రాంతంగా "మావిగన్' పేరుతో ప్రకటించాలని మాజీ సీఎం, వైకాపా అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. 'మచిలీపట్నంలోని ఎంఏ, విజయవాడలో వీఐ, గుంటూరులో జీయూఎన్ ఇలా తొలి ఆంగ్ల అక్షరాలను కలిపి 'మావిగన్' అని పేరు పెట్టండి. గన్ అంటే మీకు నచ్చదు, జగన్ గుర్తుకొస్తాడనుకుంటే వేరే పేరు పెట్టండి.. విజయవాడలో 20 లక్షలు, గుంటూరులో 10 లక్షలు, మచిలీపట్నంలో 4లక్షలు మొత్తమ్మీద 35లక్షల

- మిగతా 2లో

## కాంగ్రెస్ 'యువరాజు'కు వందోసారి కూడా ఓటమి తప్పదు



అస్సాంలో భాజపా మూడోసారి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ని ఉద్దేశిస్తూ.. 'ఆ పార్టీ యువరాజు కు వందోసారి కూడా ఓటమి తప్పదు' అని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మోదీ అస్సాంలో పర్యటించారు. ఈ సందర్భంగా గోగముఖ్‌లో జరిగిన బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు. 'అస్సాం మాజీ సీఎం సర్బానంద

- మిగతా 2లో

## జీఎస్టీ వసూళ్లలో సరికొత్త రికార్డు..

### తొలిసారి రూ. 2 లక్షల కోట్లు దాటిన ఆదాయం!

- మార్చిలో రూ. 2 లక్షల కోట్లకు చేరిన జీఎస్టీ వసూళ్లు
- గతేడాదితో పోలిస్తే 8.8 శాతం పెరిగిన ఆదాయం
- దిగుమతులపై పన్నుల వసూళ్లలో భారీ వృద్ధి నమోదు
- 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ. 22.27 లక్షల కోట్లకు చేరిన వసూళ్లు

- మిగతా 2లో







## మీసేవ వినియోగ ఛార్జీలు 50% పెంపు

- సేవలన్నింటిపై 18 శాతం జీఎస్టీ
- ప్రజలు, విద్యార్థులపై ఆర్థిక భారం
- తక్షణమే అమల్లోకి రానున్న ప్రభుత్వ ఉత్తర్వులు

- మిగతా 2లో



## విద్యాశాఖపై లోకేశ్ సమీక్ష..

### మధ్యాహ్న భోజనం, క్లిక్కర్ విధానంపై కీలక ఆదేశాలు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు, మౌలిక సదుపాయాల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా, విద్యావ్యవస్థలో చేపట్టాల్సిన సంస్కరణలపై ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో సమగ్రశిక్ష అధికారులతో ఆయన సుదీర్ఘ సమీక్షా

- మిగతా 2లో

- మధ్యాహ్న భోజనం నాణ్యతపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు లోకేశ్ ఆదేశం
- రాష్ట్రవ్యాప్తంగా 9వ తరగతి విద్యార్థులకు క్లిక్కర్ విధానం అమలు చేయాలని నిర్ణయం
- లీప్ యాప్ వినియోగంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని దిశానిర్దేశం
- అమరావతిలో స్టేట్ సెంట్రల్ లైబ్రరీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచన
- ఆటిజం సపోర్ట్ సెంటర్ల ఏర్పాటు, సిబ్బంది నియామకాలపై సమీక్షలో చర్చ

# అమరావతికి జై

-మొదటిపేజీ తరువాయి

రఘురామ్‌రెడ్డి, గడ్డం వంశీకృష్ణ, మల్లు రవి మాట్లాడారు. వైకాపా సభ్యుడు మిథున్‌రెడ్డి తప్ప అందరూ సంపూర్ణంగా సమర్థించారు.

**రైతుల త్యాగాలకు, రాష్ట్రాభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందన్న భరోసా**

ఆంధ్రప్రదేశ్ నుంచి మాట్లాడిన నాయకులంతా విభజన తర్వాత రాష్ట్రం ఎదుర్కొన్న ఇబ్బందులు, రాజధాని లేక కోల్పోయిన గౌరవమర్యాదలు, రైతుల త్యాగాలు, వారిని వైకాపా ప్రభుత్వం అణచివేసిన విధానం గురించి వివరించారు. ఈ బిల్లు రైతుల త్యాగాలకు, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కేంద్రం కట్టుబడి ఉందన్న భరోసాకు గుర్తింపు అని అభివర్ణించారు. తెలంగాణ నుంచి మాట్లాడిన నాయకులూ అమరావతికి సంపూర్ణ మద్దతు పలికారు. రాష్ట్రాలుగా విడిపోయినా అన్నదమ్ముల్లా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ ఎంపీలు మాత్రం కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకుంటూ తెలంగాణకు అన్యాయం చేస్తోందని ఆక్షేపించారు. విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆ వాదనలను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. రాష్ట్రానికి అన్యాయం చేసింది గత 12 ఏళ్లుగా అధికారంలో ఉన్న భారాస, కాంగ్రెస్‌లే తప్ప కేంద్ర ప్రభుత్వం కాదన్నారు. వారు అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రాన్ని దోచుకుపోతే ప్రధానమంత్రి మోదీ రాష్ట్రానికి చేయూతనిచ్చే ప్రయత్నం చేస్తున్నారని కితాబిచ్చారు. వీరు కాకుండా బయటి రాష్ట్రాల నుంచి ధర్మేంద్ర యాదవ్ (ఎస్పీ), అరవింద్ గణపత్ సావంత్ (శివసేన- ఉద్ధవ్‌ఠాక్రే), భజ్‌రంగ్ మనోహర్ సోన్‌వానే (ఎన్‌సీపీ శరద్‌పవార్), మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే కుమారుడు శ్రీకాంత్ శిందే (శివసేన), ఇండిపెండెంట్ పప్పూ యాదవ్, మాజీ కేంద్ర మంత్రి, అకాలీదళ్ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ సతీమణి హర్‌సిమ్రత్ కౌర్‌లు అమరావతికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అమరావతి అందమైన నగరంగా మరో హైదరాబాద్‌లా అవతరించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర రాజధాని కోసం రైతులు చేసిన త్యాగాలను కొనియాడారు. వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ తమ పాత మిత్రపక్షమేనని సమాజ్‌వాదీ పార్టీ, ఉద్ధవ్ ఠాక్రే శివసేన సభ్యులు అభివర్ణించారు. హైదరాబాద్ నగరాన్ని ఐటీ హబ్‌గా మార్చి ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చిన చంద్రబాబు తన అనుభవంతో ఈ కలల రాజధానిని అద్భుతంగా రూపొందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అధికారంలో ఉండగా రాజధాని రైతులపై దమనకాండను ప్రదర్శించిన వైకాపా నాయకులు బుధవారం సభలో మాత్రం మొసలికన్నీరు కార్చారు. అధికారంలో ఉండగా తెరలు కట్టుకొని రాజధాని ప్రాంతంలో వారికి కనిపించకుండా పోయినట్లు లోక్‌సభలోనూ రైతు ప్రయోజనాలను అడ్డం పెట్టుకొని వాకౌట్ చేసి వెళ్లిపోయారు.

సభ్యుల ప్రసంగాల తర్వాత హోం శాఖ సహాయ సహాయ మంత్రి నిత్యానందరాయ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాజధాని విషయంలో ఉన్న అస్పష్టతను తొలగించేందుకే విభజన చట్టాన్ని సవరించి అమరావతే రాష్ట్ర రాజధాని అన్న స్పష్టత ఇస్తున్నామని ప్రకటించారు. 'ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు ఒక కొత్త రాజధాని ఏర్పడాల్సి ఉంది. దాన్ని అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం 2015 ఏప్రిల్ 23న చట్టం ద్వారా అమరావతిని రాష్ట్ర రాజధానిగా ప్రకటించింది. ఇప్పుడు మళ్లీ ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కోరుతూ శాసనసభ ద్వారా మార్చి 28న తీర్మానం చేసి కేంద్రానికి పంపింది.

విభజన చట్టంలోని సెక్షన్ 5(2)లో ఉన్న అస్పష్టతను సవరించి, అమరావతిని రాజధానిగా ప్రకటించాలని తీర్మానంలో కోరింది. అందుకే ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని చేర్చి, చట్టబద్ధమైన స్పష్టత ఇస్తున్నాం. 2024 జూన్ 2 నుంచి ఆంధ్రప్రదేశ్ కొత్త రాజధానిగా అమరావతి ఆచరణలోకి వచ్చినట్లు సెక్షన్ 5(2)ని సవరిస్తున్నాం. అందువల్ల ఈ బిల్లుకు ఆమోదం తెలిపి ఆంధ్రప్రదేశ్ రాజధాని విషయంలో ఉన్న అస్పష్టతను తొలగించి, చట్టపరంగా స్పష్టత ఇచ్చేందుకు మద్దతు ఇవ్వండి' అని కోరారు. అనంతరం సభాధ్యక్ష స్థానంలో కూర్చున్న ప్యానల్ స్పీకర్, తెదేపా ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అమరావతి చట్టబద్ధత బిల్లును ఓటింగ్‌కు పెట్టారు. సభ్యులందరూ దానికి ఆమోదం తెలిపారు. నో అన్న మాటే వినపడలేదు. దీంతో బిల్లు ముక్తకంఠంతో మూజువాణి ఓటు ద్వారా సభామోదం పొందింది.

# 'మావిగన్'ను రాజధానిగా ప్రకటించండి

-మొదటిపేజీ తరువాయి

మంది జనాభా ఉన్న ఈ ప్రదేశంలో ఖర్చు పెడితే అది మహానగరంగా, గ్రోత్ ఇంజిన్‌గా ఎదుగుతుంది" అని పేర్కొన్నారు. తమ హయాంలో చేసిన మూడు రాజధానులను ఈ ప్రభుత్వం రద్దు చేసింది కాబట్టి, తాము ఇచ్చిన ఈ ప్లాన్-బి 'మావిగన్'ను అమలు చేయాలన్నారు. బుధవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అమరావతిపై అసెంబ్లీలో చేసిన తీర్మానం డ్రామా అని విమర్శించారు. "భవిష్యత్తులోనూ రాజధానిని ఎవరూ మార్చకుండా చట్టం తెస్తున్నామని చంద్రబాబు చెబుతున్నారు.. అసెంబ్లీలో వీళ్లు చేయగా లేనిది, అదే అసెంబ్లీలో మళ్లీ సవరణ చేయలేరా? చట్ట సవరణల గురించి తెలిసి కూడా తానేదో కొత్తగా, విప్లవాత్మకంగా తీసుకువస్తున్నట్లు చంద్రబాబు బిల్డప్ ఇచ్చారు" అని వ్యాఖ్యానించారు.

**రాజధానితో కేంద్రానికి సంబంధం లేదు**

దేశానికి మాత్రమే రాజధాని అని ఉంటుంది తప్ప, రాష్ట్రాలకు రాజధాని గురించి రాజ్యాంగంలో ఎక్కడా లేదని జగన్ అన్నారు. "రాష్ట్రాల రాజధానుల నిర్ణయం పూర్తిగా ఆయా రాష్ట్రాలదే. ఇదే విషయాన్ని గతంలో ఏపీ హైకోర్టులో కేంద్రం సమర్పించిన అఫిడవిట్‌లోనూ పేర్కొంది. ఉత్తరాఖండ్, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను ఏర్పాటు చేసినపుడు వాటికి రాజధానులను కేంద్రం నిర్ణయించలేదేం? ఆయా రాష్ట్రాలే నిర్ణయించుకున్నాయి" అని చెప్పారు.

**చంద్రబాబు చెబుతున్నఅమరావతి అసాధ్యం**

చంద్రబాబు చెబుతున్న లక్ష ఎకరాల అమరావతి అసాధ్యమని, అది గుదిబండ అని జగన్ వ్యాఖ్యానించారు. ఆ లక్ష ఎకరాల్లో చంద్రబాబు ఇప్పటివరకూ కట్టింది ఎంత?, ఆయన చెప్పినట్లు అమరావతి నిజంగా సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్ అయిందా? అమరావతిలో ఇప్పటివరకూ ఎన్ని భూములు అమ్మారు? అని ప్రశ్నించారు. అమరావతిలో చేపడుతున్న పనుల్లో ఎక్కడా లేనివిధంగా ఎస్ఎఫ్టీ నిర్మాణానికి రూ.11వేల నుంచి రూ.14వేల ధర పెట్టారన్నారు. చంద్రబాబు కట్టాలనుకుంటున్న 5 టవర్ల టెండర్లను గమనిస్తే వీళ్లు చేస్తున్న దోపిడీ ముందు వీరప్పన్ కూడా సరిపోడనేలా ఉందని వ్యాఖ్యానించారు. అమరావతికి, రాష్ట్రంలోని మరే ప్రాంతానికి తాము ఎప్పుడూ వ్యతిరేకం కాదని చెప్పారు. మొత్తమంతా తెచ్చి అమరావతిలోనే ఖర్చు చేస్తే రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలు, ప్రజలు ఏమైపోవాలని ప్రశ్నించారు. "అమరావతి పనుల్లో అవినీతిపై ఇప్పుడు మేం ప్రెస్‌మీట్ పెట్టి చెప్పగలమే తప్ప ఇంకేం చేయగలం.. మేం అధికారంలోకొచ్చాక దీనిపై విచారణ జరుగుతుంది, బాధ్యులకు శిక్ష పడుతుంది" అని ఓ ప్రశ్నకు సమాధానంగా జగన్ వెల్లడించారు.

**ఇప్పటికీ మీ అందరి చిరునామా హైదరాబాదే**

చంద్రబాబు 2014 నుంచి ఈ 12ఏళ్లలో ఈ ప్రాంతంలో ఉన్నారా? కాపురం పెట్టారా? అని జగన్ ప్రశ్నించారు. చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్‌లకు ఇప్పటికీ హైదరాబాదే చిరునామా అని విమర్శించారు. తనకు మాత్రమే అమరావతిలో సొంత ఇల్లుందని, అమరావతికి ఎవరూ వ్యతిరేకం కాదని చెప్పారు. "నాకు సంకుచిత ఆలోచనే ఉంటే రాజధానిని రాయలసీమలోనే పెట్టేవాడిని.. విశాఖపట్నంలో ఎందుకు పెట్టేవాడిని?, అమరావతిని శాసన రాజధానిగా కొనసాగించాల్సిన అవసరం ఏమొచ్చేది?" అని ప్రశ్నించారు.

# విద్యాశాఖపై లోకేశ్ సమీక్ష... మధ్యాహ్న భోజనం, క్లిక్కర్ విధానంపై కీలక ఆదేశాలు

-మొదటిపేజీ తరువాయి

సమావేశం నిర్వహించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని, కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. అదే సమయంలో, అభ్యసన ఫలితాలను మెరుగుపరిచేందుకు రాష్ట్రవ్యాప్తంగా 9వ తరగతి విద్యార్థులకు క్లిక్కర్ ఆధారిత విధానాన్ని అమలు చేయాలని కీలక నిర్ణయం తీసుకున్నారు.

**మధ్యాహ్న భోజనం, లీప్ యాప్‌పై దృష్టి**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతపై మంత్రి లోకేశ్ ప్రధానంగా దృష్టి సారించారు. ఈ విషయంలో ఎలాంటి ఫిర్యాదులకు తావివ్వకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. దీనిపై అధికారులు స్పందిస్తూ, సోమవారం నుంచి లీప్ యాప్ ద్వారా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరిస్తున్నామని మంత్రికి వివరించారు. మంగళవారం నాటికి 6,719 పాఠశాలల నుంచి అభిప్రాయాలు సేకరించినట్లు తెలిపారు. ఈ ఫీడ్‌బ్యాక్ సేకరణ ప్రక్రియను పూర్తిగా ఆటోమేషన్ చేయాలని లోకేశ్ ఆదేశించారు. లీప్ యాప్ వినియోగంపై తల్లిదండ్రుల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సూచించారు. పాఠశాలల అభివృద్ధిలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల పాత్ర చాలా కీలకమని, అభ్యసన ఫలితాల మెరుగుదలలో వారిని భాగస్వాములను చేయాలని అభిప్రాయపడ్డారు.

**క్లిక్కర్ విధానం, స్టూడెంట్ కిట్లపై సమీక్ష**

నూతన సాంకేతికతను విద్యారంగంలో వినియోగించడంపై సమావేశంలో చర్చించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న క్లిక్కర్ ఆధారిత పునశ్చరణ విధానంపై తల్లిదండ్రుల నుంచి సానుకూల స్పందన వస్తోందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన లోకేశ్, తొలుత రాష్ట్రవ్యాప్తంగా 9వ తరగతి విద్యార్థులందరికీ ఈ విధానాన్ని అమలు చేయాలని ఆదేశించారు. ఆ తర్వాత దశలవారీగా ఇతర తరగతులకు విస్తరించాలని సూచించారు. మరోవైపు, ఇరాన్ యుద్ధం కారణంగా పెట్రోలియం ఆధారిత ఉత్పత్తుల లభ్యత తగ్గడంతో స్టూడెంట్ కిట్లపై ప్రభావం పడుతోందని అధికారులు వివరించారు. అయితే, విద్యార్థి మిత్ర కిట్ల నాణ్యత విషయంలో పూర్తిస్థాయిలో పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని హామీ ఇచ్చారు.

**ఆటిజం సెంటర్లు, ఖాళీల భర్తీ**

సమాజంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని లోకేశ్ తెలిపారు. ఇందులో భాగంగా ఆటిజం సపోర్ట్ సెంటర్ల ఏర్పాటుపై సమీక్షించారు. ఫేజ్-1 కింద చినకాకాని, బాపట్లలో నిర్మాణం పూర్తయిన కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని నిర్ణయించారు. ఫేజ్-2 కింద ఈ ఏడాది జూన్ నాటికి 28 కేంద్రాలు, నవంబర్ నాటికి 95 కేంద్రాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు వివరించారు. ఈ కేంద్రాల నిర్వహణకు నిమ్హాన్స్ (చీ×వీనూచీూ) వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల సహకారంతో మానసిక వైద్యులు, కౌన్సిలర్లకు శిక్షణ ఇప్పించాలని మంత్రి ఆదేశించారు. కేజీబీవీ అడ్మిషన్లు, 1095 బోధనేతర, 277 బోధన సిబ్బంది నియామక ప్రక్రియలపైనా సమావేశంలో చర్చించారు.

**అమరావతిలో స్టేట్ సెంట్రల్ లైబ్రరీ**

ప్రజాప్రభుత్వం అమరావతిలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించ తలపెట్టిన స్టేట్ సెంట్రల్ లైబ్రరీ ప్రాజెక్టుపై కూడా మంత్రి లోకేశ్ సమీక్ష జరిపారు. భవన తుది నమూనాను ఈ సందర్భంగా ఆమోదించారు. పనులను త్వరితగతిన ప్రారంభించి, 2028 నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మానవవనరుల శాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్య డైరెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఎండీ సీఎన్ దీవన్ రెడ్డి, పబ్లిక్ లైబ్రరీస్ డైరెక్టర్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రంప్ గజిబిజి మాటలు

వాషింగ్టన్, దుబాయ్: పశ్చిమాసియాలో యుద్ధంపై పరస్పర విరుద్ధ ప్రకటనలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా గందరగోళాన్ని మరింత పెంచారు. ఇరాన్‌పై తమ దాడులను మరో 2-3 వారాల్లో ముగించే అవకాశాలు ఉన్నాయని, హర్మూజ్ జలసంధిని తెరిపించడం తమ పని కాదని తొలుత చెప్పిన ఆయన.. తర్వాత స్వరం మార్చారు! హర్మూజ్‌ను తెరిచి, స్వేచ్ఛగా ఉంచేదాకా దాడులు కొనసాగిస్తామని ప్రకటించారు. అక్కడ నౌకల రాకపోకలను అడ్డుకుంటే.. బాంబుల వర్షంతో ఇరాన్‌ను రాతియుగం నాటి దశకు తీసుకెళ్తామని హెచ్చరించారు. ఈ పరిణామాలతో పశ్చిమాసియాలో యుద్ధం ముగింపుపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. మరోవైపు- ఇరాన్‌పై ఇజ్రాయెల్ బుధవారం కూడా భీకర వైమానిక దాడులు చేసింది. టెహ్రాన్ సైతం ఇజ్రాయెల్‌పై, పర్షియన్ గల్ఫ్‌లోని పొరుగు దేశాలపై దాడులు కొనసాగించింది. యూఏఈపై జరిగిన దాడిలో ఓ భారతీయుడు గాయపడ్డాడు.

**టెహ్రాన్ ఒప్పందానికి రాకున్నా..: ట్రంప్**

ఇరాన్ తమతో ఒప్పందం చేసుకోవాలని ఎదురుచూస్తోందని ట్రంప్ తెలిపారు. 2-3 వారాల్లోనే ఆ దేశంపై దాడులను ఆపేసే అవకాశాలున్నాయని ఓవల్ కార్యాలయంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ చెప్పారు. "ఇరాన్ ఇక అణ్వాయుధాలను తయారుచేయలేదు అని నేను విశ్వసించినప్పుడు.. ఆ దేశం ఒప్పందానికి రాకపోయినాసరే యుద్ధం ఆపేస్తా. హర్మూజ్‌లో నౌకల రాకపోకలకు భద్రత కల్పించడం మా పని కాదు. అక్కడ రవాణా కార్యకలాపాలు కొనసాగించే దేశాలే ఆ పని చూసుకోవాలి. యుద్ధం ఆగితే అమెరికాలో ఇంధన ధరలు తగ్గుతాయి. ఇరాన్ కొత్త నాయకత్వం సహకార దృక్పథంతో ఉంది. త్వరలో ఒప్పందం కుదరొచ్చు" అని పేర్కొన్నారు. బుధవారం ఉదయంకల్లా ట్రంప్ స్వరం మార్చారు. హర్మూజ్‌లో రాకపోకలను అడ్డుకోవడం ఇరాన్ ఆపాలని.. లేకపోతే బాంబుల వర్షం కురిపించి ఆ దేశాన్ని రాతియుగం నాటి దశకు తీసుకెళ్తామని హెచ్చరించారు. ఇరాన్ అధ్యక్షుడు కాల్పుల విరమణ కోరుకుంటున్నారని.. అయితే హర్మూజ్‌లో స్వేచ్ఛాయుత రవాణా నెలకొన్నప్పుడే అది సాధ్యమవుతుందని 'ట్రూత్ సోషల్'లో రాసుకొచ్చారు. 'ఇరాన్ నూతన ప్రభుత్వ అధ్యక్షుడు' అని ఆయన తన పోస్టులో పేర్కొనడం గమనార్హం. అమెరికా-ఇజ్రాయెల్ దాడుల ప్రభావం నుంచి కోలుకోవడానికి ఇరాన్‌కు 15-20 ఏళ్లు పట్టొచ్చని ట్రంప్ అన్నారు.

**'నాటో.. కాగితపు పులి'**

ఇరాన్‌తో యుద్ధంలో తమకు మిత్రదేశాల నుంచి మద్దతు దక్కకపోవడంపై ట్రంప్ మరోసారి ఆగ్రహం వ్యక్తంచేశారు. నాటోను కాగితపు పులిగా అభివర్ణించారు. ఈ విషయం రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు కూడా తెలుసన్నారు. నాటో నుంచి తాము(అమెరికా) వైదొలిగే ది దిశగా తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు ఓ వార్తాసంస్థతో ముఖాముఖిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. బ్రిటన్ నౌకాదళ సామర్థ్యాలను ఆయన ఎద్దేవా చేశారు. మరోవైపు- పశ్చిమాసియాలో అదనపు బలగాల మోహరింపును అమెరికా కొనసాగిస్తోంది.

## వైభవోపేతం.. రాములోరి కల్యాణం

-మొదటిపేజీ తరువాయి

పండువగా తితిదే నిర్వహించింది. కల్యాణ మండపాన్ని దేశ విదేశాల నుంచి తీసుకొచ్చిన అరుదైన పుష్పాలతో అలంకరించారు. ఉత్సవం చివరి వరకు చంద్రబాబు దంపతులు, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, మంత్రులు రామనారాయణరెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పుట్టా సుధాకర్ యాదవ్, మాధవిరెడ్డి, పుత్తా చైతన్యరెడ్డి, ఆదినారాయణరెడ్డి, తెదేపా పొలిట్ బ్యూ రో సభ్యుడు శ్రీనివాసులురెడ్డి, తితిదే సభ్యులు వీక్షించారు. జైశ్రీరామ్ నామస్మరణతో కల్యాణోత్సవ వేదిక ధ్వనించింది. ముఖ్యమంత్రి దంపతులు ఒంటిమిట్టలోనే రాత్రికి బస చేశారు. గురువారం ఉదయం 8.30 గంటలకు తిరుగు ప్రయాణం కానున్నారు.

## ఉచిత విద్యుత్ పథకంతో చేనేత కుటుంబాలకు ఉపశమనం

-మొదటిపేజీ తరువాయి

ఎక్స్ వేదికగా బుధవారం పోస్ట్ చేశారు. 'ఈ పథకం అమలుతో చేనేత కుటుంబాలకు ఉత్పత్తి వ్యయం తగ్గి ఉపశమనం కలుగుతుంది. 2017లో చేనేత కార్మికులు నన్ను కలిసి వారి కష్టాలు చెప్పినప్పుడు నా మనసు చలించింది. వారికి నా వంతు అండగా నిలిచేందుకు చేనేత బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండేందుకు ముందుకొచ్చా. వారంలో ఒక రోజు ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించాలని పిలుపునిచ్చా. అది యువతలో చైతన్యం నింపింది. నివార్ తుపాను కారణంగా వెంకటగిరి చేనేత మగ్గాలకు నష్టం జరిగినప్పుడు స్వయంగా వెళ్లి వారి కష్టాల్ని చూసి అండగా ఉంటానని భరోసానిచ్చా. ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యపక్షంగా ఉన్నందుకు ఆనందంగా ఉంది' అని పేర్కొన్నారు.

## జీఎస్టీ వసూళ్లలో సరికొత్త రికార్డు.. తొలిసారి రూ. 2 లక్షల కోట్లు దాటిన ఆదాయం!

దేశంలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు సరికొత్త మైలురాయిని అందుకున్నాయి. 2026 మార్చి నెలలో జీఎస్టీ ఆదాయం తొలిసారిగా రూ. 2 లక్షల కోట్ల మార్కును దాటింది. ఇవాళ విడుదలైన అధికారిక గణాంకాల ప్రకారం మార్చిలో స్థూల జీఎస్టీ వసూళ్లు రూ. 2,00,064 కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే నెలలో వసూలైన రూ. 1,83,845 కోట్లతో పోలిస్తే ఇది 8.8 శాతం అధికం. దేశీయంగా స్థిరమైన ఆదాయంతో పాటు దిగుమతులపై పన్ను వసూళ్లు గణనీయంగా పెరగడమే ఇందుకు ప్రధాన కారణంగా నిలిచింది. దిగుమతులపై పన్నుల రాబడి ఏకంగా 17.8 శాతం పెరగగా, దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన ఆదాయం 5.9 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇక రీఫండ్‌లను సర్దుబాటు చేసిన తర్వాత, నికర జీఎస్టీ వసూళ్లు మార్చిలో రూ. 1,77,990 కోట్లుగా నమోదయ్యాయి. ఇది గతేడాదితో పోలిస్తే 8.2 శాతం ఎక్కువ.మొత్తం 2025-26 ఆర్థిక సంవత్సరంలోనూ జీఎస్టీ వసూళ్లు సానుకూల వృద్ధిని కనబరిచాయి. ఈ ఏడాది స్థూల వసూళ్లు 8.3 శాతం వృద్ధితో రూ. 22.27 లక్షల కోట్లకు చేరాయి. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో (2024-25) ఇవి రూ. 20.55 లక్షల కోట్లుగా ఉన్నాయి. అంతర్జాతీయంగా ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ, దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉందని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి.భారత ఆర్థిక వ్యవస్థ సుమారు 7 శాతం జీడీపీ వృద్ధితో ముందుకు సాగుతున్న తరుణంలో జీఎస్టీ వసూళ్లు కూడా అదే స్థాయిలో పెరగడం శుభపరిణామమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. పెరుగుతున్న వినియోగం, దిగుమతులు, మెరుగైన పన్నుల చెల్లింపుల వ్యవస్థ దీనికి కారణమని వారు అభిప్రాయపడ్డారు. గత 12 నెలలుగా జీఎస్టీ వసూళ్లు వరుసగా రూ. 1.7 లక్షల కోట్ల కంటే పైనే నమోదు కావడం గమనార్హం.

## పన్ను తగ్గిస్తున్నాం.. ఇతర రాష్ట్రాల బస్సులను ఏపీకి తీసుకురండి

-మొదటిపేజీ తరువాయి

బస్సులను ఏపీకి తీసుకొచ్చి రీ-రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కోరారు. అన్నమయ్య జిల్లా రామాపురం మండలంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో.. రవాణాశాఖ ప్రధాన కార్యదర్శి, కమిషనర్, ఇతర సీనియర్ అధికారులు, అఖిల భారత పర్యాటక బస్సుల యజమానుల సంఘ సభ్యులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పన్ను తగ్గించిన రెండు నెలల్లో.. అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్ వంటి రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న 700 వరకు బస్సులను ఏపీకి తీసుకొచ్చి రీ-రిజిస్ట్రేషన్ చేయాల్సిన బాధ్యత బస్సుల యజమానులపై ఉందని మంత్రి అన్నారు. బస్సుల్లో సరకు రవాణాను అనుమతించబోమని, ప్రయాణికుల లగేజీ మాత్రమే తీసుకెళ్లాలని మంత్రి తెలిపారు. బస్సుల యజమానుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. పన్ను తగ్గిస్తే, బస్సులన్నింటినీ ఏపీకి తీసుకొస్తామని చెప్పారు.

## కాంగ్రెస్ 'యువరాజు'కు వందోసారి కూడా ఓటమి తప్పదు

-మొదటిపేజీ తరువాయి

సోనోవాల్ నాయకత్వంలో, ప్రస్తుత సీఎం హిమంత బిశ్వశర్మ నాయకత్వంలో రాష్ట్రం చాలా అభివృద్ధి చెందింది. ఈసారి కూడా ఎన్డీయే ప్రభుత్వం హ్యాట్రిక్ కొట్టడం ఖాయం. అలాగే కాంగ్రెస్ కూడా వరుసగా మూడోసారి ఓటమి చవిచూడాల్సి వస్తుంది. ఆ పార్టీ యువరాజుకు వందోసారి కూడా ఓటమి తప్పదు' అని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కాంగ్రెస్ విభజన విధానాలను అనుసరిస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా మంగళవారం భాజపా విడుదల చేసిన మ్యానిఫెస్టో గురించి ప్రధాని ప్రస్తావించారు. అస్సాంలో ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ)ని అమలుచేస్తామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఆదివాసీల హక్కులను కాపాడతామన్నారు.

**తేయాకు తోటలో మోదీ సెల్ఫీ**

అంతకుముందు దిబ్రుగఢ్ జిల్లాలోని ఒక తేయాకు తోటను ప్రధాని మోదీ సందర్శించారు. అక్కడి మహిళా కార్మికులతో కలిసి తేయాకు ఆకులను కోశారు. వారితో సెల్ఫీలు కూడా దిగారు. ఈ ఫొటోలను మోదీ తన అధికారిక ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు.

## మీసేవ వినియోగ ఛార్జీలు 50% పెంపు

రాష్ట్ర ప్రభుత్వం మీసేవ కేంద్రాల ద్వారా అందించే పౌర సేవలపై వినియోగ ఛార్జీలు 50 శాతం పెంచింది. తక్షణమే పెంచిన ఛార్జీలను (ఏప్రిల్ 1, బుధవారం) అమల్లోకి తీసుకువచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం అందించే పౌర సేవలపై 18 శాతం జీఎస్టీ విధించనుంది. కేటగిరీ-ఏలో రూ.35 నుంచి రూ.62కి, కేటగిరీ-బీలో రూ.45 నుంచి రూ.80కి పెంచింది. వాస్తవానికి 50 శాతం ఛార్జీలు పెంచినప్పటికీ.. జీఎస్టీ భారంతో కలిపి ఈ ఛార్జీల పెంపు 77-78 శాతం వరకు ఉన్నాయి. దీంతో పౌర సేవల కోసం దరఖాస్తు చేసే ప్రజలు, విద్యార్థులపై ఆర్థిక భారం పడనుంది. మరోవైపు మీసేవ నిర్వాహకులకు వచ్చే కమీషన్ దాదాపు 15 ఏళ్ల తరువాత గణనీయంగా పెరిగింది. మీసేవ ద్వారా అందించే పౌర సేవల్లో కేటగిరీ-ఏలో అదనపు డాక్యుమెంట్లు, సంబంధిత విభాగం పరిశీలన అవసరం లేకుండా సేవలు అందుతాయి. కేటగిరీ-బీలో సంబంధిత విభాగం విచారణ, పరిశీలన అనంతరం అందించే సేవలు వస్తాయి. గతంలో కేవలం వినియోగ ఛార్జీలు చెల్లించి దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉండేది. దరఖాస్తుకు అదనంగా నాలుగుకు మించి పత్రాలు స్కాన్ చేయాలన్నా.. ప్రింట్ తీసుకోవాలన్నా పేజీకి రూ.2 చొప్పున చెల్లించాలి. కానీ తాజాగా వినియోగ ఛార్జీలతో పాటు నాలుగు పేజీల తరువాత ఒక్కో పేజీకి రూ.2.5 చొప్పున ఫీజు ఖరారు చేసింది. ఉదాహరణకు కొత్తగా కుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసే వ్యక్తి గతంలో రూ.45 చెల్లిస్తే సరిపోయేది. ఇప్పుడు పెంచిన 50% ఛార్జీతో కలిపి రూ.67.5, దీనికి అదనంగా జీఎస్టీ 18% కలిపి రూ.79.65 (రౌండ్ ఫిగర్ రూ.80) చెల్లించాలి. అంటే ఒక్కో పత్రం కోసం దరఖాస్తు ఫీజు భారం రూ.35గా ఉంది.

# ప్రభుత్వ భూముల పరి రక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలి.






- సీఎంఓ కార్యాలయం, పిజిఆర్ఎస్ లో వచ్చిన దరఖాస్తుల పై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చేపట్టాలి.
- రెవెన్యూ అధికారుల సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్

**అనకాపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 01:** జిల్లా లోని ప్రభుత్వ భూముల పరి రక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదేశించారు. బుధవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో, జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్ తో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొని అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న భూముల తాలూక తాజా పరిస్థితులను తెలుపుతూ నివేదికలు సమర్పించాలని, సంక్లిష్ట పరిస్థితులకు సంబంధించి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పట్టాదార్ పాస్ బుక్స్ పంపిణీ, రీ సర్వే, వెబ్ ల్యాండింగ్ పోర్టింగ్, తదితర అంశాల పై నిర్వహించాల్సిన విధి విధానాల గురించి ప్రస్తావించారు. మ్యుటేషన్ల ప్రక్రియలో జాప్యాన్ని నివారించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జీవో ఎంఎస్ నెంబర్ 30 ప్రకారం అందరికీ ఇల్లు కార్యక్రమం పై అధికారులకు దిశా నిర్దేశం చేశారు.
సీఎంఓ కార్యాలయం నుండి, పిజిఆర్ఎస్ లో వచ్చిన దరఖాస్తుల పై అధికారులు స్వయంగా పరిశీలించి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. 22-ఏ పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎన్హెచ్ -5 నకు ఆనుకొని ఉన్న భూములను గుర్తించాలని తెలిపారు. కోర్టు కేసుల విషయంలో అధికారుల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. చౌక ధరల దుకాణాలు, పెట్రోలు బంకులను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. చౌక ధరల దుకాణాలకు మహిళలు పిల్లలు వచ్చినట్లయితే ముందుగా వారికి సరుకులు పంపిణీ చేయాలని, మంచి నీరు ఏర్పాటు చేయాలని, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో చర్చించి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లాలో గ్యాస్ కొరత లేదని, గ్యాస్ ఏజెన్సీలలో ముందస్తు బుకింగ్స్ లేకుండా చూడాలని, గ్యాస్ సిలిండర్లను డోర్ డెలివరీ ద్వారా మాత్రమే అందజేయాలని, గ్యాస్ గోడౌన్ వద్ద ఎటువంటి డెలివరీలు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. గనులు క్వారీల పై అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. జిల్లాలో ఫైర్ క్రాకర్ యూనిట్ల కు సంబంధించిన తనిఖీ నివేదికలను సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణ రావు, అనకాపల్లి నర్సీపట్నం రెవిన్యూ డివిజనల్ అధికారులు వివి రమణ, షేక్ ఆయేషా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, సర్వే శాఖ ఏడీ, డీఎస్ఓ, పలువురు తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, పలువురు రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో మురికివాడ ప్రాంతాలను అభివృద్ధి పరుస్తాం.





- పెన్షన్లను అందించిన పశ్చిమ ఎమ్మెల్యే పి జి వి ఆర్ నాయుడు, కమిషనర్ కేతన్ గార్గ్.
- మురికివాడ ప్రాంత అభివృద్ధికి ప్రణాళికలు చేపడతాం కేతన్ గార్గ్.

**విశాఖపట్నం, పెన్ సత్తా, ఏప్రిల్ 01**: విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గ పరిధి లోని 57 వ వార్డు ఆశివానిపాలెం, దుర్గానగర్, సాకేత్ పురం ప్రాంతాల్లో పేదల సేవలో కార్యక్రమంలో బుధవారం పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు పీ.జీ.వీ.ఆర్ నాయుడు (గణబాబు), జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ లు సంయుక్తంగా పాల్గొని లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అందించారు. ఈ సందర్భంగా పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు గణబాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం లోని కూటమి ప్రభుత్వం ప్రతి పేదవాడికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందాలనే లక్ష్యంతో పనిచేయడం జరుగుతుందని, ఎన్టీఆర్ ఆర్థిక భరోసా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి అందించడం జరుగుతుందని తెలిపారు. అలాగే కూటమి ప్రభుత్వం సంక్షేమముతో పాటు మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆశవానిపాలెం దుర్గా పురంలో ఉన్న మురికివాడ లోని పేద, మధ్యతరగతి ప్రజలకు సంక్షేమం తో పాటు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ఇక్కడ ప్రజలు సరైన ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నారని వారికి గృహ సముదాయం నిర్మించేలా చర్యలు చేపట్టాలని శాసనసభ్యులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం జివిఎంసి కమిషనర్ మాట్లాడుతూ పింఛన్ల పంపిణీ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా నేరుగా వారి ఇంటి వద్దకే చేర్చేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మురికివాడల అభివృద్ధి దిశగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని ఆశవాణి పాలెం దుర్గాపురం మురికివాడ ప్రాంతం అభివృద్ధికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇక్కడ నివసించే ప్రజలు సరైన ఇల్లు లేని కారణంగా చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, వారికి అవసరమయ్యే కనీసం రెండు పడక గదులు, వంటగది హాలు మరుగుదొడ్లు ఉండే విధంగా బహుళ అంతస్తులు ఇల్లు నిర్మించేందుకు చర్యలు చేపడతామని, నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు ఇక్కడ ప్రజలకు అవసరమయ్యే అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని కమిషనర్ తెలిపారు.
ఈ పంపిణీ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బి .హేమావతి, గవర కార్పొరేషన్ డైరెక్టర్ పెంటకోట అజయ్ బాబు, ఏపీడి, సచివాలయ సిబ్బంది, వార్డు నాయకులు పాల్గొన్నారు.



# సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేసిన పంచకర్ల








**పెందుర్తి, పెన్ సత్తా, ఏప్రిల్ 01:**
15,37,168 లక్షల రూపాయల సీఎం సహాయనిధి చెక్కులను 33 మంది బాధిత కుటుంబ సభ్యులకు అందజేసిన చేసిన జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు.
పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ సంతృప్తినిచ్చే కార్యక్రమం రమేష్ బాబు. పెందుర్తి నియోజకవర్గం సుజాతనగర్ క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా లబ్ధి పొందిన పేదలకు చెక్కుల పంపిణీ చేసే కార్యక్రమం తనకు వ్యక్తి గతంగా ఎంతో సంతృప్తినిచ్చేదని జనసేన విశాఖ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు పేర్కొన్నారు. సుజాతనగర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం 33 మంది లబ్ధిదారులకు 15,37,168 లక్షల రూపాయల విలువైన చెక్కులను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు సాయం అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ నిరంతరం తపన పడతారని, అందులో భాగంగానే అర్హులైన పేదలందరికీ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందించడం అని పేర్కొన్నారు. ఉమ్మడి ఎన్ డి ఏ నాయకులు మీడియా మిత్రులు ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపు నిచ్చారు. సమాజంలో ఏ ఒక్క పేద కుటుంబానికి అన్యాయం జరగకూడదన్నది కూటమి ప్రభుత్వం లక్ష్యమని, అందులో భాగంగానే ఈ కార్యక్రమాన్ని విరివిగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. నెలకు కనీసం రెండు సార్లు పేదలకు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి క్యాంపు కార్యాలయానికి తీసుకొస్తే వారికి 15 రోజుల్లోనే తగిన ఆర్థిక సాయం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందే ఏర్పాట్లు చేస్తామని ఎమ్మెల్యే రమేష్ బాబు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కొరుపోలు రాము నాయుడు, కర్రీ కనకరాజు, అయితే సింహాచలం నాయుడు, ఇందల రమణ, గొల్లవిల్లి రమణ, గంటల దివాకర్, బుగిడి రామ గోవింద్, బోద్దపు శ్రీనివాసరావు, ఏఎన్ఆర్, బల్రెడ్డి అప్పారావు, సదరం భీమేశ్వర రావు, పిన్నేటి పార్వతి, కంచిపాటి మధు, రాపర్తి కిషోర్, ఆర్ఎస్ నాయుడు, సాలాపు మోహన్, సబ్బార్పు రమణ, గొర్లి అప్పారావు, కర్రీ నరసింగ రావు, అయితే శ్రీను, వరూధిని, ఉగ్గిన దేవుడు, బల్రెడ్డి ప్రసాద్, తనకాల శ్రీను, పెందుర్తి, పరవాడ, సబ్బవరం వార్డు పరిధిలో ఉన్న ఉమ్మడి ఎన్ డి ఏ మహాకూటమి నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

# ఎన్.టి.ఆర్. భరోసా పెన్షన్లు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్.


**జిల్లాలో 2,53,336 మందికి రూ.107.75 కోట్లు విడుదల.**





**అనకాపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 01:** ప్రతి లబ్దిదారునికి ఎన్.టి.ఆర్. భరోసా పెన్షన్లు సక్రమంగా అందేలా పంపిణీ పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ ఆదేశించారు. బుధవారం ఉదయం అనకాపల్లి మండలం, 84 వ వార్డ్, పెరుగు బజారులో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని లబ్దిదారుల ఇంటికి వెళ్లి పించన్లు అందించారు. పెన్షన్లు పంపిణీ విధానం పై ఆరా తీసి సక్రమంగా సకాలంలో అందుతున్నది, లేనిది లబ్దిదారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో జరుగుతున్న పెన్షన్లు పంపిణీ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.
జిల్లాలో మొత్తం 2,53,336 మంది లబ్ధిదారులకు రూ.107,75,70,500 పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అనకాపల్లి జోన్‌తో పాటు రెండు మున్సిపాలిటీలు మరియు 24 గ్రామీణ మండలాల్లో ఉదయం 5 గంటల నుంచే లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ ప్రారంభించినట్లు తెలిపారు. శతశాతం పెన్షన్లు పంపిణీ పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఎ ప్రోజెక్టు డైరెక్టరు కె.శచీదేవి, జీవీఎంసీ కమిషనర్ చక్రవర్తి, 84 వ వార్డు కార్పొరేటర్ నీలంశెట్టి చిన్న తల్లి తదితరులు పాల్గొన్నారు.

# నూకంబిక అమ్మవారిని దర్శించుకున్న చాగంటి కోటేశ్వర రావు





**అనకాపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 01**: రాష్ట్ర పండుగ, ఉత్తరాంధ్ర ఇలవేల్పు, గవరపాలెంలో వెలిసిన నూకాంబిక అమ్మవారిని ఆధ్యాత్మిక ప్రవచన చక్రవర్తి, రాష్ట్ర ప్రభుత్వం సలహాదారుడు (నైతిక విలువలు) చాగంటి కోటేశ్వర రావు అమ్మవారికి దర్శించుకొని, ప్రత్యేక పూజల నిర్వహించారు. ముందుగా ఆలయానికి వచ్చిన ఆయనకు పూర్ణకుంభంతో మేళతాలాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఆయనకు దేవస్థానంలో మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం అమ్మవారి దర్శనం చేయించి, అమ్మవారి చిత్రపటం, ప్రసాదం ఇచ్చి ఘనంగా సత్కరించారు.
ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళశ్రీధర్, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్ కుమార్, దాడి రవికుమార్, పొలిమేర స్వాతి ఆనంద్ కుమార్, మారిశెట్టి శంకర్రావు, కాంద్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాస రావు,కొడుకుల శ్రీకాంత్, వద్దాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారి నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

## నిబద్ధతతో ఉద్యోగం చేసి రిటైర్మెంట్ అయిన గ్రంథాలయ శాఖ ఉద్యోగికి ఘన సన్మానం.



**వలిగొండ మండలం పెన్ సత్తా ఏప్రిల్ 01:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలో ఉన్న గ్రంథాలయ శాఖ లో నిబద్ధతతో పనిచేసి రిటైర్మెంట్ అయినా పిట్టల ఆంజనేయులును జిల్లా గ్రంథాలయ శాఖలో జిల్లా చైర్మన్ అవేస్ చిస్తూ ఉర్ రహమాన్ ,కార్యదర్శి సుధీర్, శాలువాతో ఘనంగా సన్మానం చేసినారు, ఈ కార్యక్రమంలో లైబ్రరీఎన్ సిబ్బంది కావ్య పాఠకులు అభిమానులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలిగా భాధ్యతలు చేపట్టిన షేక్ షాజహాన్ పర్వీన్.




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా ఏప్రిల్ 01:**మార్చి 26 న కొత్తగూడెం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం 2026 – 27 ఎన్నికల్లో వైస్ ప్రెసిడెంట్ – 1 గా పోటీ చేసి ఘన విజయం సాధించిన సీనియర్ మహిళ న్యాయవాది షేక్ షాజహాన్ పర్వీన్ నేడు భాధ్యతలు స్వీకరించారు. గత 16 సంవత్సరాలుగా న్యాయవాదా వృత్తి లో ఉన్న షాజహాన్ పర్వీన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టు మొట్టమొదటి ఉపాధ్యక్షురాలు గా గెలిచి చరిత్ర సృష్టించారు. కొత్తగూడెం బార్ అసోసియేషన్ లైబ్రరీ హల్ లో ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఎన్నికల ప్రధాన అధికారి పలివేల గణేష్ బాబు చేతులు మీదిగా నియమకం పత్రం అందుకున్న పర్వీన్ తనపై నమ్మకం తో తనకు ఓటువేసి గెలిపించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. బార్ అసోసియేషన్ అభ్యున్నతి కోసం న్యాయవాదుల సంక్షేమం కోసం కృషి చేస్తానని షాజహాన్ పర్వీన్ తెలిపారు.

## చేగుంటలో వ్యాపారుల భారీ ర్యాలీ



**చేగుంట: పెన్ సత్తా ఏప్రిల్ 01:** చేగుంట మండల కేంద్రంలో బుధవారం నాడు తెలంగాణ రాష్ట్ర చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు బుధవారం రాష్ట్రవ్యాప్తంగా చికెన్ షాపుల బంద్ విజయవంతంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రంలో వ్యాపారులు షాపులు మూసివేసి నిరసన ర్యాలీ నిర్వహించారు. పౌల్ట్రీ కంపెనీలు రిటైల్ వ్యాపారులకు ఇచ్చే మార్జిన్‌ను భారీగా తగ్గించడం వల్ల తాము తీవ్ర నష్టాల్లో ఉన్నామని, దుకాణాల అద్దెలు, కరెంటు బిల్లులు, కార్మికుల జీతాలు చెల్లించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ర్యాలీకి చేగుంట ఉప సర్పంచ్ మహమ్మద్ రఫీ, కాంగ్రెస్ నాయకులు సంద్రుగు సతీష్, వార్డు సభ్యులు ఆరిఫ్ తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ రఫీ మాట్లాడుతూ.. సామాన్యుల ఆహార అలవాట్లలో కీలకమైన చికెన్ విక్రయాలపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయని, కంపెనీల ఏకపక్ష నిర్ణయాల వల్ల చిన్న వ్యాపారులు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కంపెనీలతో మాట్లాడి వ్యాపారులకు న్యాయమైన మార్జిన్ దక్కేలా చూడాలని డిమాండ్ చేశారు. షాపు యజమాని షకిల్ మాట్లాడుతూ.. రవాణా ఖర్చులు పెరిగినా కంపెనీలు తమకు ఇచ్చే కమీషన్ పెంచకపోవడం అన్యాయమని, న్యాయం జరిగే వరకు పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాపారులు మహమ్మద్ సలీం, మహమ్మద్ కలీం, హామీద్, కటిక శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు తిర్లాపురం గ్రామంలో గ్రామ సభ కార్యక్రమం విజయవంతం చేయండి...

- గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో గ్రామస్తులందరికీ ఆహ్వానం..
- గ్రామ సర్పంచ్ చేపలమడుగు వీరబాబు...




**చింతకాని పెన్ సత్తా ఏప్రిల్ 01:** ప్రతినిధి.తెలంగాణలో 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఏప్రిల్ 2, 2026 న తిర్లాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నేడుఉదయం 10 గంటలకు గ్రామసభలు పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చింతకాని మండల పరిషత్ అభివృద్ధి అధికారి జూనియర్ అసిస్టెంట్ జి. ప్రశాంత్ హాజరవుతున్నారు. గ్రామ సమస్యలపై చర్చ ప్రధాన లక్ష్యం. మరియు గ్రామాభివృద్ధి ప్రణాళికలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు.ఇతర ప్రజా ప్రతినిధుల పర్యవేక్షణలో సభలు జరుగుతాయి గ్రామ ప్రజలు సకాలంలో హాజరై తమ సమస్యలను అధికారులకు విన్నవించి పరిష్కరించుకోవాలని గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు తెలియజేశారు.

# ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన భోజనం అందించాలి

- హోంమంత్రి వంగలపూడి అనిత
- నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆకస్మికంగా తనిఖీ
- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన హోం మంత్రి



**నక్కపల్లి, పెన్ సత్తా ఏప్రిల్ 01:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు.పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై స్వయంగా పరిశీలించారు. ముఖ్యంగా వంటశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి ఆహార నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ, వారికి అందుతున్న ఆహారం గురించి అడిగి తెలుసుకున్నారు. భోజనం చేస్తున్న సమయంలోనే పాఠశాలలో మౌలిక వసతులు ఎలా ఉన్నాయో విద్యార్థులను అడిగి వివరాలు సేకరించారు. విద్యార్థులు భోజనం చేసే ప్రదేశాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని హోంమంత్రి అనిత సూచించారు. పాఠశాలల్లో శుభ్రత, క్రమశిక్షణ, మరియు నాణ్యమైన ఆహారం అందించడం అత్యంత ముఖ్యమని ఉపాధ్యాయులకు ఆమె సూచించారు.

# పింఛన్ల పంపిణీలో హోంమంత్రి అనిత



చేనేత కార్మికులతో హోంమంత్రి



**నక్కపల్లి, పెన్ సత్తా ఏప్రిల్ 01:** పాయకరావుపేట నియోజకవర్గంలో హోం మంత్రి అనిత పింఛన్లు పంపిణీ చేశారు. బుధవారం పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నక్కపల్లి చేరుకున్న హోంమంత్రి వంగలపూడి అనితకు స్థానిక మహిళలు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి అనిత ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తూ ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా నేతన్నల జీవితాల్లో కొత్త వెలుగులు నింపే లక్ష్యంతో ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలపై కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. చేనేత మగ్గాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, దీని వల్ల చేనేత కార్మికులపై కరెంట్ బిల్లుల భారం తగ్గి ఆదాయం పెరుగుతుందని మంత్రి వివరించారు. నక్కపల్లిలో చేనేత కార్మికులతో మాట్లాడిన మంత్రి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఒక చేనేత కార్మికురాలితో కలిసి మగ్గంపై నేసి, ఆమె వద్ద నుంచి చీరను కొనుగోలు చేశారు. అనంతరం బోదుగలం సమీపంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో నూతనంగా నిర్మించుకున్న గృహాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమరావతి తోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి బాటలు.

- రాష్ట్రానికి ప్రపంచ స్థాయి రాజధాని అవసరం ఉంది.
- ప్రతి తెలుగువాడి గుండె చప్పుడు అమరావతి.
- జగన్ ఇక మూడు ముక్కలాట ఆడలేరు.
- లోక్‌సభలో అమరావతి బిల్లుకు ఆమోదం
- శాశ్వత రాజధానిగా అమరావతికి చట్టబద్ధత



**అనకాపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 01:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందిన సందర్భంగా రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సి.ఎం రమేష్ కీలక వ్యాఖ్యలు చేశారు. 2014 నాటి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టానికి సవరణ చేసి, రాష్ట్ర నూతన రాజధానిగా "అమరావతి" పేరును అధికారికంగా చేర్చనున్న ఈ బిల్లు రాష్ట్ర భవిష్యత్తుకు కీలక మలుపు అని ఆయన పేర్కొన్నారు. లోక్‌సభలో జరిగిన చర్చలో మాట్లాడుతూ రాష్ట్రానికి సుస్థిర అభివృద్ధి సాధ్యమయ్యేది ప్రపంచ స్థాయి రాజధానిగా అమరావతిని అభివృద్ధి చేయడం ద్వారానే అని స్పష్టం చేశారు. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, కొచ్చి వంటి ఆర్థిక కేంద్రాలు లేకపోవడం అభివృద్ధికి అడ్డంకిగా మారిందని తెలిపారు.ప్రతి తెలుగువాడి గుండె చప్పుడు అమరావతేనని, ప్రజా రాజధానిగా అది చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందని ఆయన అన్నారు. రాజధాని అనేది కేవలం భవనాల సమాహారం కాదని, అది ఆంధ్రుల గౌరవానికి ప్రతీక అని స్పష్టం చేశారు.అమరావతికి చట్టబద్ధత కల్పించడంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఈ బిల్లు అమరావతిని శాశ్వత రాజధానిగా స్థిరపరుస్తుందని, ఇకపై ఎవరూ దాన్ని మార్చలేరని స్పష్టం చేశారు. పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇక పై అమరావతి విషయంలో మూడు ముక్కలాట ఆడలేరని, ఊసరవెల్లి రాజకీయాలు ఇక పనిచేయవని తీవ్రంగా విమర్శించారు. ఈ బిల్లు ద్వారా ఐదు కోట్ల మంది ప్రజల ఆకాంక్ష నెరవేరిందని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రాజధాని అంశంపై నాటకాలు ఆడిందని, రాష్ట్రాన్ని వెనక్కి నెట్టిందని విమర్శించారు. అమరావతి రైతులు న్యాయబద్ధంగా నిరసన తెలుపుతున్న సమయంలో మహిళలపై అమానుషంగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు. డబుల్ ఇంజన్ సర్కారు పై నమ్మకంతో కేవలం రెండు నెలల్లో 33 వేల ఎకరాల భూములు ఇచ్చిన అమరావతి రైతుల త్యాగాన్ని ఆయన కొనియాడారు. అమరావతిని నాశనం చేయాలని వైసీపీ ఎన్నో కుట్రలు చేసిందని ఆరోపించారు. అమరావతికి మద్దతివ్వని వారు చరిత్రలో ద్రోహులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. డబుల్ ఇంజన్ సర్కార్ ద్వారా అమరావతి అభివృద్ధి చెందితే పెట్టుబడులు పెరిగి ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయని, రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు సాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

## యువజన సంఘం బలోపేతమే లక్ష్యం.

అఖిలభారత యువజన సమాఖ్య.



**చింతకాని పెన్ సత్తా ఏప్రిల్ 01: ప్రతినిధి.**చింతకాని మండలం రాఘవపురం గ్రామంలో అఖిలభారత యువజన సమాఖ్య గ్రామ శాఖ మహాసభ యువజన సంఘం జిల్లా కోశాధికారి కొల్లి రవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అఖిలభారత యువజన సమాఖ్య
జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి మహేష్ మాట్లాడుతూ మండలంలో యువజన సంఘం బలోపేతమే లక్ష్యంగా ప్రతి గ్రామంలో కమిటీలు వేసి యువకులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమస్యలు పరిష్కారం కోసం పోరాటాలు చేస్తామని అన్నారు. భగత్ సింగ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు, చెడు వ్యసనాలకు యువకులు దూరంగా ఉండాలని కోరారు, యువజన పథకాన్ని కొల్లి రవి ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దోజు శ్రావణ్, జిల్లా సహాయ కార్యదర్శి చింతాల రమేష్, నాయకులు మామిళ్ళపల్లి రాజేష్, కనపర్తి సత్యనారాయణ, వడ్డే వీర కృష్ణ, చలమల అనిల్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ నూతన కమిటీ అధ్యక్షులుగా ఎస్కే రహీం పాషా, కార్యదర్శిగా కొత్తకొండ మురళి, 8 మంది కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ఫ్రీజ్ వితరణ చేసిన మద్దినేని. సన్మానించిన గ్రామస్తుల




**చింతకాని పెన్ సత్తా ఏప్రిల్ 01:ప్రతినిధి.**మద్దినేని సావిత్రి జ్ఞాపకార్థం, 11వ వర్ధంతి సందర్భంగా భర్త మద్దిన్ని నాగేశ్వరరావు కుమారుడు మద్దిన్ని పురుషోత్తం, (ణమ్ఘుంఎశీంఎ ఎవవఎతీవఓఓవతీ) డెడ్ బాడీ ఫ్రీజర్ నాగిలిగొండ పంచాయతీకి సాయంత్రం 5గంటలకు 30-03-2026నా నాగిలిగొండ గ్రామ పంచాయతీ కి వితరణ చేసారు. నాగిలిగొండ గ్రామ ప్రజలు మరియు పక్కన ఉన్న గ్రామాల ప్రజలు కూడా ఈ టతీవవఓవతీ ఉచితంగా వాడుకోవచ్చు అని తెలియజేసారు. అనంతరం గ్రామస్తులు ఊరికి సేవ చేయటం, ఊర్లో ప్రజలకు ఉన్న కష్టాలు తెలుసుకొని సహాయం చేయడం చాలా గొప్ప మనసు అని,వారికి ఘనంగా సన్మానం చేశారు ఈ కార్యక్రమంలో... నాగిలిగొండ గ్రామ పెద్దలు, ప్రజలు, పాల్గొన్నారు.ద

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన డీ ఎం హెచ్ ఓ. డా. తుకారాం రాథోడ్



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా ఏప్రిల్ 01:**
జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. తుకారాం రాథోడ్ , పి హెచ్ సీ ఎంపీ బంజార ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి, అక్కడ నిర్వహిస్తున్న ఆరోగ్య సేవలను సమగ్రంగా పరిశీలించారు. ముఖ్యంగా రోగనిరోధక టీకాల కార్యక్రమం (ఇమ్మునిజేషన్ సెషన్) ను ప్రత్యక్షంగా తనిఖీ చేసి, చిన్నారులకు టీకాలు వేయించే తల్లిదండ్రులతో మాట్లాడి, టీకాల ప్రాముఖ్యత, సమయానికి టీకాలు వేయించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం అక్కడ పనిచేస్తున్న వైద్య సిబ్బంది, ఎంపీ హెచ్ ఏ (పురుషులు) సూపర్వైజర్లతో సమావేశమై, ప్రస్తుత ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరు, గ్రామ స్థాయిలో జరుగుతున్న సేవలు, ఎదుర్కొంటున్న సమస్యలు వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ సిబ్బందికి పలు ముఖ్య సూచనలు జారీ చేశారు:ప్రతి గ్రామంలో ఆరోగ్య విద్యా కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించి, ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించాలి సిబ్బంది తమ టూర్ డైరీలను ప్రతిరోజూ సమయానికి పూర్తి వివరాలతో నిర్వహించాలి.నిర్వహిస్తున్న ఆరోగ్య కార్యకలాపాలన్నింటికీ సంబంధించి సరైన డాక్యుమెంటేషన్ ఉండేలా చూడాలి గ్రామ స్థాయిలో నిర్వహించిన సమావేశాలు, శిబిరాలు, అవగాహన కార్యక్రమాలలో పాల్గొన్న ప్రజల వివరాలు, వారి సంతకాలు మరియు చర్చించిన అంశాల నిమిషాలను రికార్డుల్లో నమోదు చేయాలి ఆరోగ్య సేవల నాణ్యతను మెరుగుపరచి, ప్రతి అర్హుడికి సేవలు అందేలా చర్యలు తీసుకోవాలిఅదేవిధంగా డెంగ్యూ, మలేరియా, ఫిలేరియా, జపనీస్ ఎన్సెఫలైటిస్ వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఈ వ్యాధుల నివారణకు సంబంధించిన చర్యలను గ్రామస్థాయిలో కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆయన సూచించారు. ప్రజలకు దోమల పెరుగుదలను నివారించే చర్యలు, శుభ్రత, నిల్వ నీటిని తొలగించడం వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో పీఓ (సీహెచ్ఐ) డా. ప్రతాప్ , డా. జి. పవని ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు కట్టుబడి ఉందని డీఎంహెచ్ఓ తెలిపారు.

# బాధిత కుటుంబం పరామర్శించిన ఎమ్మెల్యే

**పెన్ సత్తా ఏప్రిల్ 01:**వనపర్తి పట్టణంలోని పలు బాధిత కుటుంబాలను బుధవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పరామర్శించారు
25వ వార్డుకు చెందిన రిపోర్టర్ సిరాజుద్దీన్ ఇద్దరు కుమారులు ఇటీవల ఆకస్మికంగా మృతిచెందారు తీవ్ర షోకంలో ఉన్న సిరాజుద్దీన్ కుటుంబాన్ని ఎమ్మెల్యే గారు పరామర్శించి చిన్నారుల మృతి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు
నాలుగు సంవత్సరాల లోపు వయసు గల ఇద్దరు చిన్నారులు మృతి చెందడం దురదృష్టకరమును ఆయన ప్రగడ సానుభూతిని తెలియజేశారు
కొన్ని సంఘటనలు జీవితంలో తీవ్ర నష్టాన్ని కలుగజేస్తాయని ఇలాంటి కష్ట సమయంలో నిలదొక్కుకొని ముందడుగు వేయాలని వారికి ధైర్యాన్ని చెప్పారు
అనంతరం 3వ వార్డుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు యూసఫ్ అనారోగ్యంతో ఉన్నాడని తెలుసుకున్న ఎమ్మెల్యే వారి ఇంటికి వెళ్లి యూసఫ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు
మెరుగైన వైద్యం చేయించుకోవాలని వైద్యపరమైన సహాయ సహకారాలు అందజేస్తామని ఎమ్మెల్యే కుటుంబానికి భరోసా కల్పించారు
. మూడవ వార్డుకు చెందిన ప్రజా వైద్యశాల అంబులెన్స్ డ్రైవర్ గారి మాతృమూర్తి ఫజీలత్ బేగం ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే బుధవారం పరామర్శించారు
వారి తల్లి గారి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు
అనంతరం మూడవ వార్డుకు చెందిన జమీల్ సాహెబ్ గారి 14 సంవత్సరాల వయసుగల కుమారుడు వలిద్ హుస్సేన్ మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు
అల్లారు ముద్దుగా పెంచుకున్న పిల్లలు మృతి చెందుతే ఆ బాధ



మర్చిపోలేము అని ఇలాంటి దురదృష్టకర పరిస్థితి ఎవరికి రాకూడదని ఎమ్మెల్యే వాపోయారు
. రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి పరమశించిన ఎమ్మెల్యే
నాగవరం తాండకు చెందిన మన్యం నాయక్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు
బుధవారం ఎమ్మెల్యే ప్రభుత్వ ఆసుపత్రిలోనే మార్చురీలో గల మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు
సైకిల్ పై వెళ్తున్న సమయంలో అటుగా వెళుతున్న మరో వాహనం టైరు పగిలి సైకిల్ పై వెళ్తున్న మన్యం నాయక్ బలంగా తగలడంతో కూరగాయల పాలైన ఆయన మృత్యువాత పడ్డట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు
వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్యే కుటుంబానికి ప్రభుత్వ పరమైన ఆర్థిక సహాయ సహకారాలు అందించేలా చూస్తామని కుటుంబం మనోధైర్యం కోల్పోకుండా ఉండాలని ఆయన సూచించారు
కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, స్థానిక కౌన్సిలర్ రవియాదవ్, మైనార్టీ నాయకుడు రహీం, లక్కాకుల సతీష్, జంపన్న యాదవ్, రఫీక్, ఇర్ఫాన్, వసీం, బషీర్ జహంగీర్, పాషా, అస్లాం, జమీల్, తిరుపతి యాదవ్, యాదగిరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు


## “మీ పిల్లలకు కూడా ఇలానే భోజనం పెడతారా?”

పాఠశాలలో జిల్లా కలెక్టర్ అంకిత్ ఆగ్రహం..



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా ఏప్రిల్ 01:**దమ్మపేట మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం విస్తృత పర్యటన నిర్వహిస్తూ తహసీల్దార్ కార్యాలయం, పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న సేవలు, విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, ముఖ్యంగా మధ్యాహ్న భోజన నాణ్యతపై సమగ్రంగా ఆరా తీశారు. మొదటగా దమ్మపేట తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్, కార్యాలయంలోని అన్ని విభాగాలను తనిఖీ చేసి, దరఖాస్తుల పరిష్కార విధానంపై అధికారులను ప్రశ్నించారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడి, కుల ధృవీకరణ, ఆదాయ, నివాస ధృవీకరణ, రేషన్ కార్డుల వంటి దరఖాస్తుల పురోగతిని తెలుసుకున్నారు. దరఖాస్తులను నిర్ణీత గడువులోనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. “మీ సేవ” ద్వారా చెల్లించవలసిన రుసుముల వివరాలను కార్యాలయంలో స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు.
భూ సమస్యలు, సర్టిఫికెట్ల జారీ వంటి అంశాలు మండల స్థాయిలోనే పరిష్కారం కావాల్సి ఉండగా, ప్రజలు ప్రజావాణి కార్యక్రమానికి ఎందుకు దూర ప్రాంతాల నుంచి రావాల్సి వస్తోందని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. సమస్యలను స్థానికంగానే త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రికార్డు రూమ్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమావేశమై, విద్యుత్, మిషన్ భగీరథ, ఇరిగేషన్, వ్యవసాయం, పోలీస్ శాఖల పనితీరును సమీక్షించారు. గ్రామసభల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లు చేయాలని, వేసవి కాలంలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం దమ్మపేట తెలంగాణ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలించిన కలెక్టర్,ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న భోజనాన్ని నేరుగా పరిశీలించారు. మెనూ ప్రకారం ఆ రోజు చికెన్ బగారా రైస్ అందించాల్సి ఉండగా, అది అందుబాటులో లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్, మెనూ పాటించకపోవడంపై సంబంధిత సిబ్బందిని ప్రశ్నించారు. విద్యార్థులకు అందించవలసిన ఆహారాన్ని ఎందుకు ప్రదర్శించడం లేదని వెంటనే ప్రదర్శించాలని ఆదేశించారు.
విద్యార్థులకు వడ్డించడానికి సిద్ధంగా ఉన్న ఆహారాన్ని స్వయంగా రుచి చూసిన కలెక్టర్, ఆహార నాణ్యతపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. “మీ పిల్లలకు కూడా ఇలానే భోజనం పెడతారా?” అని ప్రశ్నిస్తూ వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిల్మేకర్ కూర సరిగా నువ్వు ఉడక పోవడం , రుచి, నాణ్యత లోపించడం పట్ల అసహనం వ్యక్తం చేస్తూ, విద్యార్థులకు పోషక విలువలు కలిగిన నాణ్యమైన ఆహారం అందించాలని, భవిష్యత్తులో నిర్లక్ష్యం పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునే ప్రదేశంలో కుళాయిలకు ట్యాప్‌లు లేకపోవడంతో నీరు వృథాగా పోతున్న పరిస్థితిని గమనించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం మందలపల్లి క్రాస్ రోడ్డు వద్ద గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలను పరిశీలించిన కలెక్టర్, అక్కడ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతున్నందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడి భోజన నాణ్యత, సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. స్టోర్ రూమ్‌ను పరిశీలించి కూరగాయలు, ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. వంటశాలలో గ్యాస్ సిలిండర్ల నిల్వలు, భద్రతా చర్యలపై ఆరా తీసి, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు.
విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ సూచించారు.
ఈ పర్యటనలో తహసీల్దార్ రామ్ నరేష్, ఎంపీడీవో రవీందర్ రెడ్డి, ఎంఈఓ జగదీష్, ఉపాధ్యాయురాలు స్టెల్లా, వార్డెన్ దుర్గ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 15వ విడత జవీ=ఖీ కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది.



**పెన్ సత్తా ఏప్రిల్ 01:** ఈ కార్యక్రమంలో వనపర్తి శాసనసభ్యులు తూడి మెఘా రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
జిల్లాలోని పలు మండలాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.
మొత్తం 796 మంది లబ్ధిదారులకు ఈ విడతలో ప్రయోజనం కలిగింది.
ఈ చెక్కుల విలువ మొత్తం మూడు కోట్ల 48 లక్షల 14 వేల 966 రూపాయలుగా ఉంది.
లబ్ధిదారులు ఎమ్మెల్యే చేతుల మీదుగా చెక్కులు అందుకుని ఆనందం వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మెఘా రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తోందన్నారు.
ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను కొనసాగించడం అభినందనీయమన్నారు.
గత ప్రభుత్వంలో లాగా ఆలస్యం చేయకుండా వెంటనే చెక్కులు విడుదల చేస్తున్నామని తెలిపారు.
ప్రజలకు అండగా నిలుస్తున్న ప్రభుత్వంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.
ప్రజా నాయకుడైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.
అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.
ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.
లబ్ధిదారులు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.
కార్యక్రమం సంతోష వాతావరణంలో ముగిసింది.

# గ్రామ సభలు విజయవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా ఏప్రిల్ 01:**జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ అమలు లో భాగంగా గ్రామ సభలను విజయవంతగా నిర్వహించాలి అని జిల్లా కలెక్టర్ అంకిత్ ఒక ప్రకటనలో తెలిపారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గురువారం జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు, మున్సిపల్ పట్టణాల్లో వార్డు సభలను తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని సభలకు హాజరయ్యే ప్రజలకు తాగునీటి సదుపాయం కల్పించాలని అధికారులను ఆదేశించారు. అలాగే సభల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు.
రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను గ్రామ, వార్డు స్థాయిలో ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని అధికారులకు సూచించారు. ఇందుకోసం ప్రతి శాఖ తమకు సంబంధించిన పథకాలపై సమగ్ర




నివేదికలు సిద్ధం చేసి ప్రజలకు వివరించాలని చెప్పారు.
సభలు ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా షామియానాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే వైద్య ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించి గర్భిణులు, చిన్నారులకు వైద్య పరీక్షలు చేయాలని సూచించారు.
విద్యాశాఖ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని, వ్యవసాయ శాఖ రైతులకు లాభదాయక పంటలు, ఉద్యాన పంటలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఏప్రిల్ 2వ తేదీ నుంచి జిల్లాలో వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేయనున్నట్లు వెల్లడించారు.
గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో సభలను విజయవంతం చేయడం ద్వారా ప్రజల సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారం చూపడం ముఖ్య లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ప్రజలు సభలకు సమయానికి హాజరై స్థానిక సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మ్యాచ్ తర్వాత స్టేడియం క్లీన్ చేసిన జపాన్ ఫ్యాన్స్.. మనమైతే ఏం చేసే వాళ్లం..?





క్రికెట్ లేదా ఫుట్ బాల్ మ్యాచ్ లు చూసేందుకు స్టేడియాలకు వెళుతుంటాం కదా. మ్యాచ్ జరుగుతుండగా ఏం చేస్తాం. మనం సపోర్ట్ చేస్తున్న టీమ్ కోసం గొంతు చించుకునేలా అరుస్తాం.. పేపర్లు చింపేసి వెదజల్లుతాం.. ఇంకా నానా అల్లరి, హంగామా చేస్తాం కదా. మ్యాచ్ పూర్తయ్యాక ఏం చేస్తాం.. చిప్స్ పాకెట్స్ కవర్స్, కోక్స్ ఎంప్టీ బాటిల్స్.. వగైరా అన్నీ సీట్లపైనా, స్టేడియం అంతటా వదిలేసి వస్తుంటాం కదా.
కానీ జపాన్ ఫ్యాన్స్ కూడా మనలాగే మ్యాచ్ ఎంజాయ్ చేశారు. అల్లరి చేశారు. విజిల్స్ వేశారు.. తమ టీమ్ కు ఫుల్ సపోర్ట్ చేశారు. మ్యాచ్ పూర్తయ్యాక తమ టీమ్ గెలిచిందనే గర్వం లేకుండా స్టేడియం మొత్తం క్లీన్ చేసి ప్రపంచంలోని కోట్లాది మంది హృదయాలను దోచుకున్నారు. ఈ న్యూస్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. మనం ఎలాగో చేయం.. కనీసం వాళ్ల డెడికేషన్ ఏంటో తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

**హృదయాలను కదిలించిన ఆరేళ్ల పాప:**
2026, మార్చి 31న ఇంగ్లండ్ లోని వెంబ్లీ స్టేడియంలో ఫుట్ బాల్ మ్యాచ్ జరిగింది. ఇంగ్లండ్--జపాన్ మధ్య జరిగిన మ్యాచ్ లో తమ టీమ్ కు సపోర్ట్ చేసేందుకు జపాన్ ప్లేయర్లు స్టేడియంకు వచ్చారు. ఈ మ్యాచ్ లో జపాన్ 1--0 తేడాతో ఇంగ్లండ్ పై గెలిచింది. మెన్స్ ఫుట్ బాల్ లో మొదటిసారి ఆసియన్ దేశాల నుంచి ఒక టీమ్ ఇంగ్లండ్ ను ఓడించింది. కౌరు మితోమా చేసిన గోల్ తో.. విన్నింగ్ విజిల్స్ మోగాయి. ఇంగ్లండ్ ఫ్యాన్స్ నిరాశతో సైలెంట్ అయిపోగా.. జపాన్ ఫ్యాన్స్ గెలుపును ఎంజాయ్ చేస్తూనే తమ బాధ్యతను మర్చిపోలేదు. గెలిచాక గోల చేస్తూ.. ప్రత్యర్థి టీమ్ ను తిడుతూ.. అపోజింట్ ఫ్యాన్స్ ను గేలి చేస్తూ.. గొడవలకు దిగుతూ స్టేడియంను వదిలి వెళ్లలేదు. వెంటనే వెళ్లిపోకుండా.. అందరూ వెళ్లే వరకు ఆగి.. తమ సీట్ల ముందు పడి ఉన్న కాగితాలు, పాప్ కార్న్ మగ్స్, ఇతరత్ర చెత్తను కవర్లలో వేసి డస్టుబిన్లలో వేశారు. ఇంగ్లండ్ ఫ్యాన్స్ వెళ్లిపోతున్నా.. ఇది తమ దేశం, తమ స్టేడియం కాకపోయినా ఓపికగా అంతా క్లీన్ చేసి వెళ్లిపోయారు. ముఖ్యంగా ఆరేళ్ల పాప, ఐదేళ్ల బాలుడు కూడా పెద్ద వారితో పాటు క్లీన్ చేస్తుండటం హృదయాలను కరిగించి వేసిన దృశ్యం.
ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. జపాన్ ఫ్యాన్స్ ప్రవర్తన చూసి నెటిజన్లు సలాం చేస్తున్నారు. డిసిప్లిన్, కాండక్ట్, క్వాలిటీస్, జపానీస్ ఫుట్ బాల్ కల్చర్ ను పొగుడుతున్నారు. గతంలో ఇంటర్నేషనల్ మ్యాచ్ లలో, టోర్నమెంట్లలో కూడా జపాన్ ప్రేక్షకులు ఇలాంటి క్లీనింగ్ చేసి ఆకట్టుకున్నారు. మ్యాచ్ తర్వాత క్లీనింగ్ చేయడం తమ దేశానికి మరింత గౌరవం తెస్తుందని వాళ్లు చెబుతున్నారు.
సివిక్ సెన్స్ లో మనం ఎక్కడున్నాం..?
సివిక్ సెన్స్ అంటే.. మనం చేసే పనుల వలన ఇతరులకు కలిగే మంచి, చెడులు. అంటే ఇబ్బందులు. ఈ స్టోరీ చదివాక ఏమనిపిస్తుంది. అదే ప్లేస్ లో మనం ఉంటే ఏం చేసేవాళ్లం. ఇప్పుడు, ౨20 మొదలైన క్రికెట్ మ్యాచ్ లు చూడటానికి వెళ్తుంటాం కదా. మన ప్రవర్తన ఎలా ఉంటుందోఇ ఒక సారి రిమైండ్ చేసుకోవాల్సిన టైం. క్లీనింగ్ చేయకపోయినా పర్లేదు.. కనీసం పరిసరాలను చెత్త చేయకూడదనే కామన్ సెన్స్ మన వాళ్లలో చాల వరకు ఉండదు. అలా పడేయొద్దు బ్రో అంటే.. నువ్వెవ్రా నాకు చెప్పడానికి.. అని ఇంకా ఎక్కువ చేస్తుంటాం.
అక్కడ వేయొద్దు అంటే నేను అక్కడే వేస్తా.. ఏం ఇక్కుంటావో ఇక్కో. అన్నట్లుగా చాలా ర్యాష్ గా ప్రవర్తిస్తుంటాం. అక్కడ ఉమ్మెయొద్దు, అక్కడ పోయొద్దు అని చెప్పినా అదే చేస్తుంటాం. అందుకే స్టేడియంలో గానీ, రోడ్లపై గానీ, సినిమా థియేటర్ లో గానీ.. ఎక్కడ చూసినా చెత్త, చెత్త, చెత్త. డస్ట్ బిన్ లు ఉన్నా మనకు కనబడవు. కానీ జపాన్ ప్రజల సివిక్ సెన్స్ లో మనకు ఒక 25 శాతం వరకు ఉన్నా.. మన పరిసరాలు చాలా వరకు మారిపోతాయి. మీరేమంటారు.

# ఒరాకిల్ దెబ్బకు బెంగళూరు రియల్ ఎస్టేట్ కిల్ : ఐటీ ఉద్యోగుల్లో పెరిగిన ఆందోళనలు




ఐటీ దిగ్గజం ఒరాకిల్ భారత్‌లో ఏకంగా 12వేల మందిని తొలగించడం, రానున్న రోజుల్లో మరిన్ని కోతలు ఉంటాయన్న సంకేతాలు దేశంలోని ఐటీ హబ్ నగరాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా గుర్తింపు పొందిన బెంగళూరు రియల్ ఎస్టేట్ మార్కెట్‌పై ఈ లేఆఫ్స్ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ాూ× రాకతో టెక్కీల ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకంగా మారడమే కాకుండా, వారి సొంతింటి కల కూడా చెదిరిపోయే స్థితికి పరిస్థితులు మారటం కుటుంబాల ఆర్థిక పరిస్థితిని తలకిందులు చేస్తోంది.

**బెంగళూరు రియల్టీపై లేఆఫ్స్ నీడ..**
బెంగళూరులోని సర్జాపూర్, వైట్‌ఫీల్డ్, ఎలక్ట్రానిక్ సిటీ వంటి ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ మార్కెట్ ప్రధానంగా ఐటీ ఉద్యోగుల కొనుగోలు శక్తిపైనే ఆధారపడి ఉంటుంది. ఒరాకిల్ వంటి పెద్ద కంపెనీలు భారీగా లేఆఫ్స్ ప్రకటించడంతో.. కొత్తగా అపార్ట్‌మెంట్లు కొనేందుకు సిద్ధమైన టెక్కీలు తమ నిర్ణయాన్ని వాయిదా వేసుకుంటున్నారు. దీనివల్ల ప్రీమియం, లగ్జరీ అపార్ట్మెంట్ల అమ్మకాలు భారీగా మందగించే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఏఐ వల్ల భవిష్యత్తులో ఏ ఉద్యోగం ఉంటుందో.. ఏది ఊడుతుందో తెలియని సందిగ్ధత మధ్య కోట్ల రూపాయల హోమ్ లోన్ తీసుకోవడానికి ఎవరూ సాహసించడం లేదట.

**లోన్ల భారంతో టెక్కీల ఆర్థిక కష్టాలు..**
ఇప్పటికే అపార్ట్మెంట్లు కొన్న వారి పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. నెలకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల ప్యాకేజీ ఉన్న టెక్కీలు.. ధైర్యంగా కోటిన్నర నుంచి రూ.2 కోట్ల విలువైన ఫ్లాట్లను బ్యాంక్ లోన్లతో కొని ఇరుక్కుపోయారు. ఇప్పుడు ఉద్యోగం కోల్పోవడంతో.. నెలకు లక్ష రూపాయలకు పైగా చెల్లించాల్సిన జువీ× భారం చాలా ఫ్యామిలీలను కుంగదీస్తోంది. ఒరాకిల్ ఇచ్చిన సెవరెన్స్ ప్యాకేజీ కేవలం కొన్ని నెలల ఈఎంఐలకు మాత్రమే సరిపోతుంది. ఆ తర్వాత మరో ఉద్యోగం దొరకడం కష్టమైతే.. అపార్ట్‌మెంట్‌ను అమ్ముకోవాల్సి వస్తుందని లేదా బ్యాంకులు జప్తు చేస్తాయనే ఆందోళన ఇప్పుడు టెక్కీలను వెంటాడుతోంది.
ఏఐ ప్రభావం వల్ల ఐటీ కంపెనీలు తమ వ్యూహాలను మారుస్తున్నాయి. మనుషుల కంటే మెషీన్లకే ప్రాధాన్యత ఇస్తుండటంతో.. టెక్కీల ఉద్యోగ అవకాశాలు ప్రశ్నార్థకంగా మారాయి. గతంలో ఐటీ ఉద్యోగం అంటే లైఫ్ సెటిల్ అనుకున్న వారు ఇప్పుడు అద్దె ఇళ్లలో ఉండేందుకు ఇష్టపడుతున్నారు. దీనివల్ల బెంగళూరులో రెంటల్ మార్కెట్ పెరిగే అవకాశం ఉన్నప్పటికీ.. అపార్ట్‌మెంట్ల అమ్మకాలు మాత్రం పడిపోయే ప్రమాదం ఉంది. మొత్తానికి ఒరాకిల్ లేఆఫ్స్ కేవలం ఒక కంపెనీ సమస్యగా కాకుండా.. ఐటీ హబ్ నగరాల్లోని రియల్ ఎస్టేట్ సంక్షోభానికి ట్రిగర్ పాయింట్ అవుతుందనే భయాలు పెరుగుతున్నాయి. టెక్కీల సొంతింటి కల నెమ్మదిగా ఇప్పుడు ఏఐ మేఘాల చాటున కనుమరుగవుతోంది.

# తీసేసిన ఒరాకిల్ ఉద్యోగులకు ఎన్ని లక్షల రూపాయలు ఇస్తున్నారంటే..!






అమెరికా టెక్ దిగ్గజం ఒరాకిల్ ప్రపంచ వ్యాప్తంగా 30వేల మంది ఉద్యోగులను లేఆఫ్ చేయటం భారీ చర్చకు దారితీసింది. చాలా మంది టెక్కీలు తాము అనేక సంవత్సరాలుగా కంపెనీలో నమ్మకంగా పనిచేస్తున్నామని.. అయినా కంపెనీ తమను నిర్లక్ష్యంగా తీసేసిందంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఒకరు తనకు క్యాన్సర్ ఉందని 20 ఏళ్లుగా పనిచేస్తున్నా కంపెనీ తొలగించిందని పోస్ట్ చేస్తే.. మరొక మహిళ తాను ప్రెగ్నెంట్ అని కూడా జాలి లేకుండా తొలగించిందంటూ పోస్టు చేశారు. ఇలా చాలా మంది తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.
అయితే అసలు కంపెనీలో ఎంతకాలం ఎంత జీతానికి పనిచేసిన వాళ్లు లేఆఫ్స్ కింద పరిహారం రూపంలో ఎంత డబ్బు పొందుతారనే ఆసక్తికరమైన వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం. ఇందులో ఉదాహరణకు ఎంత జీతం ఉంటే చివరికి ఎంత డబ్బు అందుకుంటారో టెక్కీలు పరిశీలిద్దాం..
కంపెనీలో పనిచేసిన ప్రతి సంవత్సరానికి 15 రోజుల జీతం. టర్మినేషన్ తేదీ వరకు ఒక నెల అన్-పెయిడ్ వేతనం. అర్హులైన ఉద్యోగులకు లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, గ్రాట్యుటీ. ఒక నెల నోటీసు పీరియడ్ జీతంతో పాటు, అదనంగా రెండు నెలల జీతం.

**రూ.10 లక్షల ప్యాకేజీతో 2ఏళ్లు పనిచేస్తే:**
ఒరాకిల్ సంస్థ ప్రకటించిన సెవరెన్స్ రూల్స్ ప్రకారం రూ.10 లక్షల వార్షిక ప్యాకేజీతో 2 ఏళ్లు పనిచేసిన టెక్కీకి అందే పరిహారం లెక్కిద్దాం. రెండు ఏళ్ల సర్వీసుకి గానూ 30 రోజుల జీతం రూ.83వేల 333, ఒక నెల నోటీసు పీరియడ్ జీతం రూ.83వేల 333, అదనంగా ఇచ్చే రెండు నెలల టాప్-అప్ జీతం రూ.లక్షా 66వేల 666 కలిపి రూ.3లక్షల 33వేల 332 అందుతాయి. దీనికి తోడు టర్మినేషన్ వరకు రావాల్సిన ఒక నెల అన్-పెయిడ్ వేతనం రూ.83వేల 333 కూడా కలిపితే మొత్తం సుమారు రూ.4లక్షల 16వేల 665 వరకు క్యాష్ రూపంలో అందుకుంటారు. అయితే రెండేళ్లు చేసిన టెక్కీకి గ్రాట్యుటీ వర్తించదు. కేవలం లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ మాత్రమే అదనంగా ఉంటుంది. అంటే ఉద్యోగికి దాదాపు రూ.4.16 లక్షల నుంచి రూ.4.50 లక్షల మధ్య పరిహారం రావొచ్చు.

**5 ఏళ్ల నుంచి పనిచేస్తూ రూ.20లక్షల ప్యాకేజీలో ఉంటే:**
ఒరాకిల్ సంస్థలో రూ.20 లక్షల వార్షిక ప్యాకేజీతో5 ఏళ్లు పూర్తి చేసిన టెక్కీకి, కంపెనీ రూల్స్ ప్రకారం భారీ పరిహారం అందుతుంది. 5 ఏళ్ల సర్వీసుగానూ ఏటా 15 రోజుల చొప్పున మొత్తం 75 రోజుల జీతం రూ.4లక్షల 16వేల 665 లభిస్తుంది. దీనికి ఒక నెల నోటీసు పీరియడ్ జీతం, కంపెనీ అదనంగా ఇస్తున్న రెండు నెలల టాప్-అప్ జీతం కలిపితే మట్నత్తం రూ.4లక్షల 99వేల 998 అవుతుంది. అలాగే 5 ఏళ్లు పూర్తి చేసినందున గ్రాట్యుటీ రూపంలో సుమారు రూ.4లక్షల 80వేల 769 అందుతాయి. వీటికి తోడు ఒక నెల అన్-పెయిడ్ శాలరీని కూడా కలుపుకుంటే.. సదరు ఉద్యోగికి మొత్తం సుమారు రూ.15లక్షల 64వేల 098 వరకు సెవరెన్స్ ప్యాకేజీ లభిస్తుంది. లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ అదనంగా ఉంటుంది కాబట్టి.. ఆ టెక్కీకి దాదాపు రూ.16 లక్షలకు పైగానే చేతికి వచ్చే అవకాశం ఉంది.

**10 ఏళ్ల నుంచి పనిచేస్తూ రూ.25లక్షల ప్యాకేజీలో ఉంటే:**
ఒరాకిల్ సంస్థలో రూ.25 లక్షల వార్షిక ప్యాకేజీతో 10 ఏళ్లు నుంచి పనిచేసిన టెక్కీకి, కంపెనీ ప్రకటించిన సెవరెన్స్ రూల్స్ ప్రకారం భారీ మొత్తం అందుతుంది. 10 ఏళ్ల సర్వీసుగానూ ఏటా 15 రోజుల చొప్పున మొత్తం 5 నెలల జీతం రూ.10లక్షల 41వేల 665 లభిస్తుంది. దీనికి ఒక నెల నోటీసు పీరియడ్ జీతం, కంపెనీ అదనంగా ఇస్తున్న రెండు నెలల టాప్-అప్ జీతం తోడవుతాయి. 10 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసినందున గ్రాట్యుటీ రూపంలో సుమారు రూ.12లక్షల 01వేల 923 అందుతాయి. వీటికి తోడు టర్మినేషన్ వరకు రావాల్సిన ఒక నెల అన్-పెయిడ్ వేతనంకలుపుకుంటే, సదరు సీనియర్ టెక్కీకి మొత్తంగా దాదాపు రూ.30లక్షల 76వేల 920 వరకు సెవరెన్స్ ప్యాకేజీ అందొచ్చు. లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ అదనంగా ఉంటుంది కాబట్టి.. ఉద్యోగికి దాదాపు రూ.32 లక్షలకు పైగానే చేతికి వచ్చే అవకాశం ఉంది. అయితే ఇక్కడ తీసుకున్న లెక్కలు అంచనాలు మాత్రమే వాస్తవంగా అందే ప్రయోజనాల్లో కొంత వ్యత్యాసం ఉండొచ్చు.

## ఒరాకిల్ సడెన్‌గా 30వేల మంది టెక్కీలను ఎందుకు తీసేసింది.. అసలు మిస్టరీ ఏంటంటే..?




సాధారణంగా ఏదైనా కంపెనీ నష్టాల్లో ఉంటేనే ఉద్యోగులను తీసేస్తుంది. కానీ అమెరికాకు చెందిన టెక్ దిగ్గజం ఒరాకిల్ విషయంలో స్టోరీ వేరే ఉంది. 15 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా 17.2 బిలియన్ డాలర్ల ఆదాయం సంపాదించినా.. ప్రపంచవ్యాప్తంగా 30వేల మంది ఉద్యోగులపై వేటు వేయడం ఇప్పుడు కార్పొరేట్ ప్రపంచంలో హాట్ టాపిక్ అయ్యింది. అందులోనూ మన భారత్ నుంచే 12వేల మంది ఉండటం టెక్కీలను వణికిస్తోంది. ఇంతకీ లాభాల్లో ఉన్న కంపెనీకి ఈ లేఆఫ్స్ పిచ్చి ఎందుకు పట్టింది? దీని వెనుక ఉన్న అసలు కారణాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం..
ఒరాకిల్ ఇప్పుడు తన పాత డేటాబేస్ వ్యాపారం కంటే AI మౌలిక సదుపాయాల పైన పగబట్టినట్లుగా పెట్టుబడులు పెడుతోంది. ముఖ్యంగా OpenAI కోసం ఏఐ డేటా సెంటర్లను నిర్మించేందుకు 156 బిలియన్ డాలర్ల భారీ ఒప్పందం కుదుర్చుకుంది. అంటే మన కరెన్సీలో ఈ డీల్ విలువ దాదాపు రూ.14 లక్షల కోట్లు. ఈ ప్రాజెక్ట్ కోసం ఏకంగా 30 లక్షల స్పెషలైజ్డ్ చిప్స్ కొనాల్సి ఉంది. రెండేళ్ల క్రితం కేవలం 6.9 బిలియన్ డాలర్లు ఖర్చు చేసిన కంపెనీ.. ఈ ఏడాది ఏకంగా 50 బిలియన్ డాలర్లను కుమ్మరిస్తోంది. ఈ భారీ పెట్టుబడుల కోసం నిధులను సర్దుబాటు చేయడానికే ఉద్యోగుల సంఖ్యపై కోత విధిస్తోంది.

**అప్పుల ఊబి..**
ఒరాకిల్ నెత్తిన ప్రస్తుతం 108 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.10 లక్షల కోట్లు అప్పు ఉంది. ఈ అప్పును భరించలేక కంపెనీ సతమతమవుతోంది. ఉద్యోగులను తీసేయడం ద్వారా 10 బిలియన్ డాలర్ల నగదును ఆదా చేయాలని ప్లాన్ చేస్తోంది. పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయంటే.. ఒరాకిల్ అప్పులు తీరుస్తుందో లేదో అన్న భయంతో బ్యాంకులు కూడా కంపెనీకి కొత్తగా అప్పు ఇవ్వడం ఆపేశాయి. బార్క్లేస్ వంటి సంస్థలు ఒరాకిల్ క్రెడిట్ రేటింగ్‌ను జంక్ అంటే అత్యంత ప్రమాదకరం అనే స్థాయికి తగ్గించేస్తామని హెచ్చరించాయి. 2009 ఆర్థిక సంక్షోభం తర్వాత ఒరాకిల్ ఇంతటి గడ్డు కాలాన్ని ఎదుర్కోవడం ఇదే మొదటిసారి.

**కస్టమర్ హ్యాండిస్తే పరిస్థితి ఏంటి?**
ఇంత రిస్క్ చేసి ఒరాకిల్ కడుతున్న డేటా సెంటర్లను వాడుకోవాల్సిన రాజూవతాూ×.. ఇప్పుడు ఎన్విడియా నుంచి కొత్త చిప్స్ కోసం చూస్తోందనే వార్తలు ఒరాకిల్ గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. ఒకవేళ కస్టమర్లు హ్యాండిస్తే.. లక్షల కోట్లు పెట్టి కట్టిన ఇన్ఫ్రాస్ట్రక్చర్ వృథా అయిపోతుంది. సాంకేతికత వేగంగా మారుతుండటంతో.. ఒరాకిల్ కొంటున్న చిప్స్ అవి వాడకంలోకి రాకముందే పాతబడిపోయే ప్రమాదం కూడా ఉందని టెక్ నిపుణులు అంటున్నారు. ఈ సంక్షోభం ఒరాకిల్ వ్యవస్థాపకుడు లారీ ఎల్లిసన్ సంపదను కూడా దెబ్బతీసింది. 2025 సెప్టెంబర్‌లో షేరు ధర 346 డాలర్లు ఉంటే.. ఇప్పుడు అది 146 డాలర్లకు పడిపోయింది. అంటే సగానికి పైగా విలువ ఆవిరైపోయింది. స్టాక్ మార్కెట్లో ఇన్వెస్టర్ల నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి, ఆర్థిక క్రమశిక్షణ పేరుతో ఒరాకిల్ తన సంస్థలోని వేలమంది ఉద్యోగులను బలిచేస్తోంది లేఆఫ్స్ పేరుతో. భవిష్యత్తులో ఏఐ ద్వారా అద్భుతాలు చేస్తామని కంపెనీ చెబుతున్నా.. ప్రస్తుతం ఆ సంస్థలో పని చేస్తున్న వేలాది మంది టెక్కీలకు మాత్రం ఇది చీకటి రోజుగానే మిగిలిపోనుంది.

## యుద్ధంతో కండోమ్ తయారీ కంపెనీలకు కష్టాలు..

## కల్లోలంలో రూ.8వేల కోట్ల బిజినెస్

గల్ఫ్ దేశాల్లో నెలకొన్న ఉద్రిక్తతలు ఊహించని విధంగా భారతదేశంలోని కండోమ్ పరిశ్రమపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. యుద్ధంతో సరఫరా వ్యవస్థల్లో అడ్డంకులు, పెట్రోకెమికల్ ఉత్పత్తుల కొరత ఇప్పుడు భారతీయ కండోమ్ తయారీ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టాయి. దాదాపు రూ.8వేల కోట్లు విలువ కలిగిన ఈ పరిశ్రమ.. ఏటా 400 కోట్లకు పైగా కండోమ్ యూనిట్లను తయారు చేస్తూ దేశ జనాభా నియంత్రణలో పాత్ర పోషిస్తోంది.కండోమ్ తయారీలో అత్యంత కీలకమైన రెండు ముడి పదార్థాల రేట్లతో పాటు సరఫరాను ఈ యుద్ధం దెబ్బకొట్టింది. మొదటిది సిలికాన్ ఆయిల్. దీనిని కండోమ్ తయారీలో లూబ్రికెంట్‌గా ఉపయోగిస్తారు. ప్రస్తుతం దీనికి భారీ కొరత ఏర్పడింది. రెండవది అమ్మోనియా. తయారీలో లాటెక్స్‌ను స్థిరీకరించడానికి ఇది ఎంతో అవసరం. గల్ఫ్ సంక్షోభం కారణంగా అమ్మోనియా ధరలు ఏకంగా 40 శాతం నుంచి 50 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వీటికి తోడు ప్యాకేజింగ్ కోసం వాడే పీవీసీ, అల్యూమినియం ఫాయిల్ రేట్లు కూడా పెరగడంతో తయారీదారులపై భారం రెట్టింపు అయ్యింది. హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్, మ్యాన్‌కైండ్ ఫార్మా, క్యూపిడ్ లిమిటెడ్ వంటి దిగ్గజ సంస్థలు ఇప్పటికే ఈ సెగను ఎదుర్కొంటున్నాయి. పెట్రోకెమికల్స్ వాడే ప్రతి వస్తువుపై ఈ ప్రభావం ఉందని కర్ణాటక డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ పేర్కొంది. ప్రభుత్వ పరంగా కూడా ముడిసరుకు కేటాయింపుల్లో 35 శాతం వరకు కోత విధించే అవకాశం ఉండటంతో ఉత్పత్తి ప్రక్రియ నెమ్మదించొచ్చని తెలుస్తోంది. ముడిసరుకు లభ్యత లేకపోవడం, లాజిస్టిక్స్ సమస్యల వల్ల ఆర్డర్లను సకాలంలో పూర్తి చేయలేకపోతున్నామని కంపెనీలు చెబుతున్నాయి.140 కోట్ల జనాభా కలిగిన భారతదేశంలో కండోమ్ మార్కెట్ తక్కువ ధర - ఎక్కువ అమ్మకాల పైనే నడుస్తోంది. అందువల్ల కండోమ్స్ రేట్లు సామాన్యుడికి అందుబాటులో ఉంటేనే జనాభా నియంత్రణ, కుటుంబ నియంత్రణ స్కీమ్స్ ఫలితాలను ఇస్తాయి. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో తయారీ ఖర్చులు పెరగడం వల్ల కంపెనీలు ధరలు పెంచక తప్పని స్థితిలో ఉన్నాయి. ధరలు పెరిగితే సహజంగానే డిమాండ్ తగ్గుతుంది. ఇది కేవలం వ్యాపార నష్టం మాత్రమే కాదు, దీర్ఘకాలంలో దేశ జనాభా నియంత్రణ లక్ష్యాలపై కూడా ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందని హెల్త్ కేర్ నిపుణులు అంటున్నారు.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా

# ఎడిటోరియల్

## టీడీపీ ఫైవ్ ఫార్ములా: త్వరలో కీలక సర్వే.. !

రాష్ట్రవ్యాప్తంగా మళ్లీ సర్వే చేపట్టాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. అయితే ఇది ప్రభుత్వానికి సంబంధించిన అంశాలపై కాకుండా పార్టీకి సంబంధించిన నాయకుల పని తీరుపై ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకోవాలని నిర్ణయించారు. త్వరలోనే మంత్రివర్గ ప్రక్షాళన ఉంటుందన్న వార్తల నేపథ్యంలో ఈ సర్వేకు ప్రాధాన్యం ఏర్పడింది. ఇటీవల కాలంలో నాయకులపై తరచుగా విమర్శలు వస్తున్నాయి. అదే విధంగా ఆరోపణలు పెరుగుతున్నాయి. అయితే అందరూ అని కాదు కానీ ఎక్కువ నియోజకవర్గాల్లో పరిస్థితి బాగానే ఉన్నప్పటికీ కొన్ని కొన్ని కీలక నియోజకవర్గాల్లో నాయకుల పనితీరు ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులు వంటి వాటిని అంచనా వేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పుడు మరోసారి సర్వే చేయించేందుకు సిద్ధమవుతోంది. ప్రధానంగా ఈ సర్వేలో మండల స్థాయి నుంచి ఎమ్మెల్యేల వరకు కూడా నాయకుల పనితీరును తెలుసుకుంటారు. స్థానిక సంస్థల ఎన్నికలు కూడా త్వరలో జరగనున్న నేపథ్యంలో అసలు వాస్తవ పరిస్థితి ఎట్లా ఉంది.. ప్రజలకు- నాయకులకు మధ్య ఉన్న సంబంధాలు బలంగా ఉన్నాయా లేవా.. అనే అంశాలను నిర్ధారించుకుంటారు. అలాగే నాయకులు ఏ మేరకు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు అనేది తెలుసుకుంటారు.

వ్యక్తిగతంగా పనితీరును అంచనా వేయడంతో పాటు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో అదేవిధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో నాయకుల పాత్ర ఎంతవరకు ఉందో తెలుసుకుంటారు. వారు ఏ మేరకు సక్సెస్ గా వ్యవహరిస్తున్నారు అన్న కీలక విషయాన్ని కూడా పరిగణాల్లోకి తీసుకుంటారు. మొత్తంగా ఐదు అంశాలను ఈ సర్వేలో ప్రస్తావించాలని నిర్ణయించినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**సర్వే సాగేది వీటిపైనే..**

1) ప్రజలతో నాయకులకు ఉన్న సంబంధం. వారితో ఉన్న కలివిడి. సమస్యల పరిష్కారం.

2) సంక్షేమ పథకాలు ప్రభుత్వ పనితీరుపై ప్రజలకు వివరిస్తున్న తీరు. వాటిలో వారి పాత్ర.- గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నియోజకవర్గంలో ఏ మేరకు అమలు చేస్తున్నారు, దీనిపై ఏ విధంగా ముందుకు సాగుతున్నారు.

3) ప్రజాదర్బార్ల నిర్వహణ. సమస్యలను పరిష్కరిస్తున్న విధానం. ప్రజల సంతృప్తిని అంచనా వేస్తారు.

4) పార్టీలో క్షేత్రస్థాయి నాయకులను కలుపుకొని వెళు_న్న తీరు. అదే విధంగా సమస్యలు పరిష్కారం... వంటి వాటిని తెలుసుకుంటారు.

5) వ్యక్తిగతంగా ఉన్న ఇమేజ్‌ను కాపాడుకుంటున్నారా లేదా అనేది అంచనా వేస్తారు. తద్వారా వచ్చే ఎన్నికల్లో తమ ఇమేజ్‌ను కొంతమేరకైనా పుంజుకునేలా చేస్తారా లేదా? అనేది చూస్తారు. ఇలా ఐదు కోణాల్లో సర్వే చేయించాలని చంద్రబాబు నిర్ణయించినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది.

# కొబ్బరి చిప్పలు పారేస్తున్నారా?



మీ ఇంటి బాల్కనీని లేదా చిన్న ఖాళీ ప్రదేశాన్ని ఒక అందమైన మినీ గార్డెన్‌లా మార్చుకోవాలని ఉందా? అందుకు వేల రూపాయలు ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. సాధారణంగా మనం వంటింట్లో వాడి పారేసే కొబ్బరి చిప్పలతో అద్భుతమైన హ్యాంగింగ్ ప్లాంటర్లను తయారు చేసుకోవచ్చు. ఇవి చూడటానికి సహజంగా ఉండటమే కాకుండా, మొక్కల వేర్లు కుళ్ళిపోకుండా కాపాడతాయి. కొబ్బరి చిప్పలు సహజసిద్ధమైనవి మరియు పర్యావరణానికి మేలు చేసేవి. వీటిలో నీరు నిల్వ ఉండదు కాబట్టి మొక్కల వేర్లు ఆరోగ్యంగా ఉంటాయి. కొంచెం సృజనాత్మకతను జోడిస్తే, ఈ వ్యర్థాలే మీ బాల్కనీలో అందమైన అలంకరణ వస్తువులుగా మారుతాయి. పర్యావరణాన్ని కాపాడుతూ, మన ఇంటిని అందంగా మార్చుకోవడానికి కొబ్బరి చిప్పలు ఒక గొప్ప సాధనం. వంటింట్లో మిగిలిపోయిన చిప్పలను శుభ్రం చేసి, అడుగున ఒక చిన్న రంధ్రం చేసి, కొంచెం మట్టి వేసి మొక్కలను నాటండి. మీ ఇంటికి వచ్చే అతిథులు మీ సృజనాత్మకతను చూసి మురిసిపోవడం ఖాయం! మనీ ప్లాంట్ : హ్యాంగింగ్ ప్లాంట్స్‌లో మనీ ప్లాంట్ అత్యంత ప్రజాదరణ పొందినది. ఇది చాలా తక్కువ సంరక్షణతో వేగంగా పెరుగుతుంది. కొబ్బరి చిప్పలో దీనిని నాటినప్పుడు, దాని తీగలు కిందికి వేలాడుతూ బాల్కనీకి పచ్చని రూపాన్ని ఇస్తాయి. దీనికి తక్కువ నీరు, ఒక మోస్తరు ఎండ ఉంటే సరిపోతుంది. స్పైడర్ ప్లాంట్ : పొడవైన, సన్నని ఆకులతో ఉండే స్పైడర్ ప్లాంట్ కొబ్బరి చిప్పలకు పర్ఫెక్ట్ మ్యాచ్. ఇది చూడటానికి అందంగా ఉండటమే కాకుండా, గాలిని శుద్ధి చేసే గుణాన్ని కూడా కలిగి ఉంటుంది. దీని తీగలు కిందికి వేలాడుతూ చిన్న చిన్న మొక్కలను ఉత్పత్తి చేస్తాయి. పోథోస్ : ఇది చూడటానికి మనీ ప్లాంట్ లాగే ఉన్నా, దీని ఆకులపై ఉండే రంగులు, డిజైన్లు భిన్నంగా ఉంటాయి. తక్కువ వెలుతురు ఉన్న ప్రదేశాల్లో కూడా ఇది అద్భుతంగా పెరుగుతుంది. బాల్కనీ గ్రిల్స్‌కు లేదా హుక్స్‌కు తగిలించడానికి ఇది సరైన ఎంపిక. ఇంగ్లీష్ ఐవీ : క్లాసిక్ గార్డెన్ లుక్ కావాలనుకునే వారు ఇంగ్లీష్ ఐవీని ఎంచుకోవచ్చు. దీని తీగలు గుబురుగా, కిందకు జాలువారుతూ బాల్కనీని అడవిలోని ఒక అందమైన కోణంలో చూపిస్తాయి. ఇది మీ ఇంటికి ఒక విదేశీ గార్డెన్ అనుభూతిని ఇస్తుంది. పోర్టులాకా : మీకు పూల మొక్కలంటే ఇష్టమా? అయితే పోర్టులాకాను ఎంచుకోండి. వివిధ రంగుల్లో పూసే దీని పూలు బాల్కనీని రంగురంగులమయం చేస్తాయి. కొబ్బరి చిప్పల్లో దీని వేర్లు త్వరగా నాటుకుంటాయి. దీనికి కొంచెం ఎండ ఎక్కువగా ఉంటే పూలు బాగా పూస్తాయి.

# సమ్మర్ హీట్ నుంచి ఉపశమనం కోసం



చెరుకురసం అంటేనే వేసవిలో ఒక అమృతం. తక్షణ శక్తిని ఇవ్వడంలో దీనికి సాటి లేదు. అదే రసంతో ఐస్‌క్రీమ్ చేస్తే.. ఆ చల్లదనం, తీపిదనం కలిపి ఇచ్చే కిక్కే వేరు. బయట దొరికే ఐస్‌క్రీమ్స్ లో ప్రిజర్వేటివ్స్ ఉంటాయి, కానీ మనం ఇంట్లో చేసుకునే ఈ వెరైటీ ఐస్‌క్రీమ్ ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. ప్రస్తుతం ఎండలు మండుతున్నాయి. బయట అడుగుపెడితే చాలు, భానుడి భగభగలకు జనం అల్లాడిపోతున్నారు. ఈ వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి మనం రకరకాల శీతల పానీయాలు, ఐస్‌క్రీమ్‌లను ఆశ్రయిస్తుంటాం. అయితే, ఎప్పుడూ తినే వెనిలా, చాక్లెట్ ఫ్లేవర్లు బోర్ కొట్టాయా? అయితే ఈసారి కొత్తగా, స్వచ్ఛమైన ప్రకృతి సిద్ధమైన 'చెరుకురసం ఐస్‌క్రీమ్' ప్రయత్నించండి. వినడానికే వింతగా ఉన్నా, దీని రుచి మాత్రం అద్భుతం.

కావలసిన పదార్థాలు: తాజా చెరుకురసం: 2 కప్పులు (మార్కెట్ నుండి తెచ్చిన వెంటనే వాడటం ఉత్తమం)/ఫ్రెష్ క్రీమ్ లేదా విప్పింగ్ క్రీమ్: 1 కప్పు/కండెన్స్‌డ్ మిల్క్: అర కప్పు (మీ తీపికి తగినట్లుగా)/ నిమ్మరసం: 1 టీస్పూన్ (పులుపు కోసం)/ అల్లం రసం: కొద్దిగా (మంచి ఫ్లేవర్ కోసం)/ ఉప్పు: చిటికెడు/

తయారీ విధానం: రసం సిద్ధం చేయడం : ముందుగా చెరుకురసాన్ని వడకట్టుకుని అందులో నిమ్మరసం, అల్లం రసం, చిటికెడు ఉప్పు కలపాలి. ఇది ఐస్‌క్రీమ్‌కు ఒక రకమైన 'మసాలా చెరుకురసం' ఫ్లేవర్‌ను ఇస్తుంది.క్రీమ్ విప్పింగ్ : ఒక వెడల్పాటి గిన్నెలో చల్లని ఫ్రెష్ క్రీమ్ తీసుకుని, అది చిక్కగా, ఫ్లఫ్ఫీగా అయ్యే వరకు బ్లెండర్‌తో బాగా గిలకొట్టాలి.మిక్సింగ్ : ఇప్పుడు అందులో కండెన్స్‌డ్ మిల్క్ వేసి మరోసారి కలిపాక, సిద్ధం చేసుకున్న చెరుకురసాన్ని కూడా పోసి ఎక్కడా ఉండలు లేకుండా సాఫ్ట్‌గా కలిపేయాలి.ఫ్రీజింగ్ : ఈ మిశ్రమాన్ని ఒక ఎయిర్ టైట్ బాక్స్‌లో పోసి, సుమారు 7 నుంచి 8 గంటల పాటు డీప్ ఫ్రీజర్‌లో ఉంచాలి. ఐస్‌క్రీమ్ పైన ఐస్ ముక్కలు పేరుకోకుండా ఉండటానికి బాక్స్ పైన అల్యూమినియం ఫాయిల్ పెట్టడం మంచిది. బయట దొరికే ఐస్‌క్రీమ్స్‌లో షుగర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. కానీ ఇందులో చెరుకులోని సహజమైన తీపి ఉండటం వల్ల ఇది శరీరానికి తక్షణ గ్లూకోజ్‌ను అందిస్తుంది. ఎండలో తిరిగి వచ్చిన వారికి ఇది ఒక అద్భుతమైన

ఎనర్జీ బూస్టర్‌లా పనిచేస్తుంది. ఈ వేసవిలో మీ పిల్లలకు కొత్తగా ఏదైనా తినిపించాలనుకుంటే ఈ 'చెరుకురసం ఐస్‌క్రీమ్' బెస్ట్ ఆప్షన్. చల్లచల్లని ఈ స్వీట్ ట్రీట్‌తో ఎండ దెబ్బ నుంచి సేదదీరండి. పైన కొద్దిగా పుదీనా ఆకులు లేదా డ్రై ఫ్రూట్స్ చల్లి సర్వ్ చేస్తే ఆ మజానే వేరు!

# ఆ సమస్యలకు అద్భుతమైన ఔషధం



ఆధునిక జీవనశైలి సమస్యలకు ఎండు ద్రాక్ష (కిస్‌మిస్) నీరు ఒక సహజ పరిష్కారం. ప్రతిరోజూ ఎండు ద్రాక్షలను నానబెట్టి ఆ నీటిని సేవించడం ద్వారా అధిక బరువు, రక్తపోటు, డయాబెటిస్ నియంత్రంచబడతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఐరన్ లోపం, రక్తహీనత, జీర్ణ, లైంగిక సమస్యలు దూరం అవుతాయి. ఇది శరీరాన్ని డిటాక్సిఫై చేసి 10 రోజుల్లోనే మంచి ఫలితాలను అందిస్తుంది.ఎండుద్రాక్ష (కిస్‌మిస్) లో శరీరానికి మేలు చేసే ఎన్నో పోషకాలు దాగున్నాయి. రుచికరంగా ఉండే కిస్‌మిస్‌ను తీపి పదార్థాలలో ఎక్కువగా ఉపయోగిస్తారు. ఎండు ద్రాక్షలో ప్రొటీన్లు, ఐరన్, విటమిన్లు, ఫైబర్, ఇతర పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. అయితే.. రాత్రంతా నీళ్లలో నానబెట్టిన ఎండు ద్రాక్ష నీరు పరగడుపున తాగడం వల్ల ఎన్నో సమస్యలు దూరం అవుతాయని.. లైంగిక ఆరోగ్యం మెరుగుపడుతుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. కిస్ మిస్ నీటితో జీర్ణక్రియ మెరుగుపడటంతోపాటు మలబద్ధకం తగ్గుతుంది. ఇది కాలేయాన్ని శుభ్రపరిచి, రక్తాన్ని పెంచి, రోగనిరోధక శక్తిని పెంచుతుంది. యాంటీఆక్సిడెంట్లతో కూడిన ఈ నీరు చర్మ ఆరోగ్యానికి, బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఆధునిక జీవనశైలి కారణంగా ఎదురయ్యే అనేక ఆరోగ్య సమస్యలకు ఎండు ద్రాక్ష నీరు ఒక సహజసిద్ధమైన, సమర్థవంతమైన పరిష్కారం. ఈ పానీయాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా కేవలం 10 రోజుల్లోనే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఈ డ్రింక్ ప్రధానంగా అధిక బరువు సమస్యకు చెక్ పెడుతుంది. దీనిలోని లెప్టిన్, గ్రిలిన్ వంటి సమ్మేళనాలు ఆకలిని తగ్గించి, అతిగా ఆహారం తీసుకోవడాన్ని నియంత్రిస్తాయి. తద్వారా సహజంగా బరువు తగ్గడానికి సహాయపడతాయి. ఇది రక్తపోటును నియంత్రణలో ఉంచుతుంది.. డయాబెటిస్ స్థాయిలను అదుపులో పెడుతుంది. శరీరంలో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్‌ను తొలగించడంలో కూడా ఎండు ద్రాక్ష నీరు కీలక పాత్ర పోషిస్తుంది. ఎండు ద్రాక్షలో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీర కణాలకు హాని కలిగించే పదార్థాల నుంచి రక్షణను అందిస్తాయి. ఫెరులుక్ యాసిడ్, రూటీన్, క్వెలెటిన్, ట్రాన్స్ కంప్టరిక్ యాసిడ్ వంటి సమ్మేళనాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఎండు ద్రాక్షలో సహజసిద్ధమైన చక్కెర తక్కువగా ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. భోజనం తర్వాత ఎండు ద్రాక్ష తీసుకోవడం వల్ల ఇన్సులిన్ నియంత్రణలో ఉంటుంది. గ్లైసెమిక్ ఇండెక్స్ బ్యాలెన్స్ కూడా నిర్వహించబడుతుంది. ఎండు ద్రాక్ష నీరు ఒక సహజసిద్ధమైన డిటాక్సిఫైర్‌గా పనిచేస్తుంది. ఇది శరీరాన్ని లోపలి నుండి శుభ్రపరిచి, మలినాలను తొలగిస్తుంది. జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది. కడుపులో యాసిడ్ సమస్యలు ఉన్నవారు ఈ నీటిని తాగడం వల్ల తక్షణ ఉపశమనం పొందుతారు.కిస్‌మిస్ నీటిని తాగడం వల్ల లైంగిక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.. ఎండుద్రాక్ష, తేనే కలిపి తీసుకోవడం వల్ల శరీరానికి శక్తి లభిస్తుంది. పురుషులలో స్టామినా పెరగడంతోపాటు స్పెర్మ్ కౌంట్, నాణ్యతను పెంచడంలో సహాయపడుతుందని పేర్కొంటున్నారు ఆయుర్వేద నిపుణులు. ఈ ఆరోగ్యకరమైన డ్రింక్‌ను తయారు చేయడానికి 10 ఎండు ద్రాక్షలను శుభ్రంగా కడిగి ఐదు గంటల పాటు నీటిలో నానబెట్టాలి. నానబెట్టిన తర్వాత, ద్రాక్షలను బాగా పిసికి, ఆ నీటిని వడగట్టాలి. ఈ నీటిని ఉదయం పూట తీసుకోవడం మంచిది. నీటితోపాటు ఆ కిస్‌మిస్ లను కూడా తీసుకోవచ్చు.. ఇందులో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఒక టీస్పూన్ నిమ్మరసం కలిపి తాగడం వల్ల శరీరం ఐరన్‌ను మెరుగ్గా గ్రహిస్తుంది.

# మిల్లెట్స్‌తో ఇలా పలావ్ చేసి తింటే.. ఆరోగ్యం డబుల్, రుచి ట్రిపుల్

మిల్లెట్స్‌తో కూడా పలావ్ చేసి తింటారు. దీని గురించి చాలా మందికి తెలియకపోవచ్చు. ఇది రుచికి మాత్రమే కాకుండా ఆరోగ్యానికి కూడా మంచిది. ఈ రెసిపీని సరైన కొలతలతో చేసి తింటే రుచి అదిరిపోద్ది. ఈ రెసిపీని ఎక్కువగా కొర్రలతో చేసి తింటారు. దీనిలో ఫైబర్, ప్రోటీన్లు ఎక్కువగా ఉంటాయి. దీనిలో మిల్లెట్స్, కూరగాయలు వేస్తారు. ఉదయం పూట బ్రేక్ ఫాస్ట్ కు ఇది పర్ఫెక్ట్. తక్కువ నీరుతో చేస్తే టేస్ట్ నెక్ట్స్ లెవెల్ అని చెప్పుకోవాలి.కావాల్సిన పదార్ధాలు : మిల్లెట్స్, నాలుగు బిర్యానీ ఆకు, 5 లవంగం, 4 యాలకులు, ఉల్లిపాయలు ముక్కలు , కట్ చేసిన పచ్చిమిర్చి, ఒక టేబుల్ స్పూన్ అల్లం-వెల్లుల్లి , క్యారెట్, ఉప్పు, కారం, నూనెను తీసుకోవాలి. మిల్లెట్ పులావ్ ను ఎలా తయారు చేయాలంటే? ముందుగా ఒక కప్పు మిల్లెట్స్‌ను తీసుకుని వాటిని ఒకటికి రెండు సార్లు కడిగి ఒక గంట పాటు నానబెట్టి పక్కన పెట్టుకోవాలి. ఇక ఇప్పుడు స్టవ్ వెలిగించి కుక్కర్‌లో కొద్దిగా నూనె వేసి అది వేడయ్యాక దాచిన చెక్క, లవంగం, నాలుగు యాలకులు, మసాలాలు కూడా వేసి బాగా వేయించాలి. కొద్దీ సేపటి తర్వాత ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి, ఒక టేబుల్ స్పూన్ అల్లం-వెల్లుల్లి పేస్ట్ వేసి బాగా వేయించాలి. ఇప్పుడు నానబెట్టిన మిల్లెట్స్ ను కుక్కర్లో వేసి రెండు గ్లాస్ ల నీళ్లు పోసి



రుచికి సరిపడా ఉప్పు కూడా వేసి టేస్ట్ చూసి మూత పెట్టాలి మీడియం మంటపై ఉంచి 5 విజిల్స్ వచ్చే దాకా మెత్తగా ఉడికించాలి. చివర్లో కొత్తిమీర వేసి కిందకు దించేయడమే.

# రిజ్వీ అద్భుత పోరాటం...

## లక్నో చేతుల్లోంచి గెలుపును లాగేసుకున్న ఢిల్లీ

**లక్నోపై 6 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్ ఘన విజయం**

**142 పరుగుల లక్ష్యఛేదనలో 26 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన ఢిల్లీ**

**అజేయ హాఫ్ సెంచరీతో (70*) జట్టును గెలిపించిన సమీర్ రిజ్వీ**

**రిజ్వీ, స్టబ్స్‌ల మధ్య 119 పరుగుల అజేయ భాగస్వామ్యం**

**తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో 141 పరుగులకే ఆలౌట్**



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ అద్భుత విజయాన్ని నమోదు చేసింది. బుధవారం నాడు లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. కేవలం 26 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయి ఓటమి అంచున నిలిచిన ఢిల్లీని, యువ బ్యాటర్ సమీర్ రిజ్వీ (47 బంతుల్లో 70 నాటౌట్; 5 ఫోర్లు, 4 సిక్సర్లు) తన అసాధారణ ఇన్నింగ్స్‌తో గెలిపించాడు. ట్రిస్టన్ స్టబ్స్ (32 బంతుల్లో 39 నాటౌట్) అతనికి అండగా నిలిచాడు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు అజేయంగా 119 పరుగులు జోడించి జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించారు.లక్నోలోని ఏకానా స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఢిల్లీ కెప్టెన్ అక్షర్ పటేల్ తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో బ్యాటింగ్‌కు దిగిన లక్నో సూపర్ జెయింట్స్, ఢిల్లీ బౌలర్ల ధాటికి 18.4 ఓవర్లలో 141 పరుగులకే కుప్పకూలింది. ఆ జట్టులో అబ్దుల్ సమద్ (36), మిచెల్ మార్ష్ (35) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. ఢిల్లీ బౌలర్లలో లుంగి ఎంగిడి, టి. నటరాజన్ చెరో మూడు వికెట్లతో లక్నో పతనాన్ని శాసించగా, కుల్దీప్ యాదవ్ రెండు వికెట్లు పడగొట్టాడు.అనంతరం 142 పరుగుల సాధారణ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆరంభం ఆశించిన స్థాయిలో లభించలేదు. కేఎల్ రాహుల్ (0), నితీశ్ రాణా (15), పతుమ్ నిస్సంక (1), కెప్టెన్ అక్షర్ పటేల్ (0) స్వల్ప వ్యవధిలో పెవిలియన్‌కు చేరడంతో ఢిల్లీ 4.3 ఓవర్లలో 26 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట దశలో క్రీజులో కలిసిన సమీర్ రిజ్వీ, ట్రిస్టన్ స్టబ్స్ అద్భుతమైన పోరాటపటిమ కనబరిచారు. లక్నో బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ స్కోరు బోర్డును ముందుకు నడిపించారు. ముఖ్యంగా రిజ్వీ తన క్లాస్ షాట్లతో అలరించి, ఒత్తిడిలోనూ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. వీరిద్దరి అద్భుత భాగస్వామ్యంతో ఢిల్లీ మరో వికెట్ నష్టపోకుండా 17.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది.

# ఇటలీ.. అవమానాల హ్యాట్రిక్

**వరుసగా మూడోసారి ఫిఫా ప్రపంచకప్‌నకు దూరం**

**బోస్నియా చేతిలో ఓటమి**

**చివరి జట్టుగా ఇరాక్‌కు అవకాశం**

**మాంటెరీ (మెక్సికో)**

ఇటలీ.. దశాబ్దాల పాటు ప్రపంచ మేటి ఫుట్‌బాల్ జట్లలో ఒకటిగా ఉన్న టీమ్. నాలుగుసార్లు ఫిఫా ప్రపంచకప్‌ను గెలుచుకున్న ఘనత ఆ దేశం సొంతం. అలాంటి జట్టు వరుసగా మూడోసారి ఈ మెగా టోర్నీకి అర్హత సాధించలేకపోయింది. క్వాలిఫయింగ్ టోర్నీలో పేలవ ప్రదర్శనతో 2018, 2022 టోర్నీలకు దూరమైన ఈ మాజీ ఛాంపియన్.. ఈసారి కూడా ప్రపంచకప్‌నకు అర్హత సాధించలేక అవమానాల హ్యాట్రిక్ కొట్టింది. మెక్సికోలో జరిగిన ప్రపంచకప్ ఇంటర్ కాంటినెంటల్ క్వాలిఫయింగ్ ఫైనల్స్‌లో ఇటలీ.. తన చివరి మ్యాచ్‌లో బోస్నియా అండ్ హట్స్‌గోవినా చేతిలో ఓడిపోవడంతో ఇంటిముఖం పట్టక తప్పలేదు. నిర్ణీత సమయంలో 1-1తో స్కోరు సమమైన ఈ మ్యాచ్‌లో.. పెనాల్టీ షూటౌట్లో ఇటలీ 1-4తో చిత్తయింది. ఈ విజయంతో బోస్నియా ప్రపంచకప్‌నకు అర్హత సాధించింది.

ఇటలీ 1932, 1938, 1982, 2006లో ప్రపంచకప్ విజేతగా నిలిచింది. తమ దేశం మరోసారి ఫుట్‌బాల్ విశ్వ సంబరానికి దూరం కావడంతో సాకర్ అంటే పడిచచ్చే ఇటలీలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఆటగాళ్లు, కోచ్‌పై అభిమానులు తీవ్ర ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు. జట్టును మొత్తం ప్రక్షాళన చేయాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. అమెరికా, కెనడా, మెక్సికో ఉమ్మడిగా ఆతిథ్యమిచ్చే 2026 ఫిఫా ప్రపంచకప్ జూన్ 11 నుంచి జులై 19 వరకు జరుగుతుంది. ఈసారి టోర్నీలో రికార్డు స్థాయిలో 48 జట్లు పోటీపడనున్నాయి. గత టోర్నీ వరకు ప్రపంచకప్‌లో 32 జట్లే ఉండేవి.

**బోస్నియా జట్టు సంబరం**

**ఆఖర్లో ఇరాక్..:** ఈసారి ఫిఫా ప్రపంచకప్‌నకు అర్హత సాధించిన ఆఖరిదైన 48వ జట్టుగా ఇరాక్ నిలిచింది. ఈ ఆసియా జట్టు.. ఇంటర్ కాంటినెంటల్ ప్లేఆఫ్ ఫైనల్స్‌లో 2-1తో బొలీవియాను ఓడించి ముందంజ వేసింది. మరోవైపు ప్లేఆఫ్స్ ఫైనల్స్‌లో కాంగో, స్వీడన్, తుర్కియే, చెక్ రిపబ్లిక్ గెలిచి ప్రపంచకప్‌నకు అర్హత సాధించాయి. కాంగో 1-0తో జమైకాపై విజయం సాధించగా.. స్వీడన్ 3-2తో పోలెండ్‌ను ఓడించింది. తుర్కియే 1-0తో కొసోవోపై పైచేయి సాధించగా.. చెక్‌రిపబ్లిక్ పెనాల్టీ షూటౌట్లో డెన్మార్క్‌పై నెగ్గింది. రెండున్నరేళ్ల పాటు సుదీర్ఘంగా సాగే ప్రపంచకప్ అర్హత ప్రక్రియకు బుధవారంతో తెరపడింది.

**ఫిఫా ప్రపంచకప్‌లో ఏ గ్రూప్‌లో ఎవరు?**

**గ్రూప్-ఎ:** చెక్‌రిపబ్లిక్, మెక్సికో, దక్షిణాఫ్రికా, దక్షిణ కొరియా
**గ్రూప్-బి:** కెనడా, బోస్నియా అండ్ హట్స్‌గోవినా, ఖతార్, స్విట్జర్లాండ్
**గ్రూప్-సి:** బ్రెజిల్, హైతీ, మొరాకో, స్కాట్లాండ్
గ్రూప్-డి: ఆస్ట్రేలియా, పరాగ్వే, తుర్కియే, అమెరికా
గ్రూప్-ఇ: కురసావో, ఈక్వెడార్, జర్మనీ, ఐవరీ కోస్ట్
గ్రూప్-ఎఫ్: నెదర్లాండ్స్, జపాన్, స్వీడన్, టునీసియా
గ్రూప్-జి: బెల్జియం, ఈజిప్ట్, ఇరాన్, న్యూజిలాండ్
గ్రూప్-హెచ్: కేప్ వెర్డీ, సౌదీ అరేబియా, స్పెయిన్, ఉరుగ్వే
గ్రూప్-ఐ: ఫ్రాన్స్, నార్వే, సెనెగల్, ఇరాక్
గ్రూప్-జె: అల్జీరియా, అర్జెంటీనా, ఆస్ట్రియా, జోర్డాన్
గ్రూప్-కె: కొలంబియా, కాంగో, పోర్చుగల్, ఉజ్బెకిస్థాన్
గ్రూప్-ఎల్: క్రొయేషియా, ఇంగ్లాండ్, ఘనా, పనామా.



# మూడేళ్ల గ్యాప్ ను ఒకేసారి ఫిల్ చేసేలా!



యంగ్ హీరో నాగశౌర్య -రంగబలి- తర్వాత ఒక్కసారిగా సైలెంట్ అయ్యాడు. అప్పటికే వరుస ఫ్లాప్ ల్లో ఉన్న నాగశౌర్య -రంగబలి-పై చాలా ఆశలే పెట్టుకున్నా? ఆ సినిమా ఫలితం కూడా తీవ్ర నిరాశనే మిగిల్చింది. దీంతో వస్తే హిట్ సినిమాతోనే తోనే రావాలని బలమైన నిర్ణయం తీసుకున్నాడు. ఈ క్రమంలోనే ఏకంగా మూడేళ్ల గ్యాప్ తీసుకున్నాడు. ఇప్పుడీ గ్యాప్ మొత్తాన్ని ఒకేసారి ఫుల్ ఫిల్ చేసేలా రెడీ అవుతున్నాడు. ప్రస్తుతం నాగశౌర్య చేతిలో ఉన్న మూడు ప్రాజెక్టులు వేర్వేరు దశల్లో షూటింగ్ జరుపుకుంటున్నాయి. సాధారణంగా హీరోలు ఏడాదికి ఒకటి లేదా రెండు సినిమాలు చేస్తుంటారు.కానీ నాగశౌర్య మాత్రం ఈ మూడేళ్ల విరామాన్ని కవర్ చేస్తూ అతి తక్కువ వ్యవధిలోనే ఈ మూడు చిత్రాలను విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఈ క్రమంలోనే యంగ్ హీరో రేయింబవళ్లు కష్టపడుతూ షూటింగ్‌లలో పాల్గొంటున్నాడు. తన కెరీర్‌లో ఇదొక కీలకమైన మలుపు గా భావిస్తున్నాడు. ఈ మూడు సినిమాల్లో క్రేజీ టైటిల్ తో రిలీజ్ అవుతున్న చిత్రం -నారీ నారీ నడుమ మురారి-. ఇదొక ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా తెలుస్తోంది. ఇప్పటికే ఈ టైటిల్ తో వచ్చిన రెండు సినిమాలు మంచి విజయం సాధించడంతో? ఈ సినిమాపైనా మంచి బజ్ నెలకొంటుంది. అదే సినిమాకు ప్లస్ పాయింట్ గా కనిపిస్తుంది.మరో చిత్రం -పోలీస్ వారి హెచ్చరిక-. ఈ సినిమాకు టైటిలే క్యాచీగా ఉంది. అలాగే మరోచిత్రం -బ్యాడ్ బోయ్ కార్తీక్- ఈ మూడు కథల్ని ఎంతో గ్యాప్ తీసుకుని మరీ ఎంచుకున్నాడు. పక్కాగా హిట్ సినిమాలు అవుతాయనే కాన్ఫిడెంట్ తోనే ముందుకెళు న్నాడు. ఈ ప్రాజెక్ట్ ల కోసం ప్రత్యేకంగా మేకోవర్ అయ్యాడు. ఫిజిక్ , లుక్ విషయంలో కూడా భారీ మార్పులు చేశాడు. మూడు సినిమాల్లోనూ శౌర్య మూడు విభిన్నమైన షేడ్స్‌లో కనిపిస్తారని సమాచారం. ఒక సినిమాలో క్లాస్ లుక్‌లో కనిపిస్తే? మరో సినిమాలో పక్కా మాస్ అవతారంలో మెప్పించబోతున్నాడని తెలుస్తోంది.హీరోగా తనను తాను మళ్ళీ ప్రూవ్ చేసుకోవడానికి ఈ మూడు సినిమాల సక్సెస్ అతడికి అత్యంత కీలకం. అందుకే ప్రొడక్షన్ వాల్యూస్ విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సినిమాలు రూపొందుతున్నాయి. సినిమా ఇండస్ట్రీలో ఒక హీరో మూడేళ్లు కనిపించకపోతే ప్రేక్షకులు మర్చిపోయే ప్రమాదం ఉంటుంది. కానీ నాగశౌర్య తన బ్రాండ్ వాల్యూను పదిలపరుచుకుంటూ ఈ మూడు సినిమాలతో మళ్ళీ టాప్ లీగ్‌లోకి రావాలని చూస్తున్నాడు. ఈ ఏడాది ద్వితీయార్థం నుండి వచ్చే ఏడాది ఆరంభం వరకు వరుసగా శౌర్య సినిమాలు థియేటర్లలో సందడి చేయనున్నాయి.



PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com